నేటి కందం-నేటికి అందం

శౌభుని దయతో పరుగుల
శౌభికుడై సూర్యవంశి చక్కగ క్రిక్కెట్
వైభవమును లోకమునకు
"వైభవు"నిగ జూపినాడు ప్రథితులు మెచ్చన్ !!

(పదిహేను సంవత్సరాల బుడతడు వైభవ్ సూర్యవంశి తన సామర్థ్యంతో క్రికెట్ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి భారత దేశపు కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి తెలియజేశాడు)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

నిన్నటితో పోల్చుకుంటే
నేడు కాస్త నయం నయం
ప్రజాస్వామ్య ఉద్యమాల
పర్వానికి లేదు భయం.
రాస్తారోకో ధర్నాలకు
రాష్ట్రంలో గతం ముప్పు
దర్నాచౌక్ మూసి వేసి
దాడి చేస్తే లేదా తప్పు

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శనివారం 30-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:230 పేజీలు:6 వెల: రూ.1/-


# రైతుల ఖాతాల్లో రూ.11,050 కోట్లు జమ



హైదరాబాద్, మే 29: (నేటినిజం ప్రతినిధి)తెలంగాణలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

ధాన్యం సేకరణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 13వేల వాహనాలను అందుబాటులో ఉంచినట్లు మంత్రి తెలిపారు.

సేకరణ ప్రక్రియలో దాదాపు 2 లక్షల మంది సిబ్బంది పాల్గొంటున్నారని చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులను పంపిణీ చేశామని వెల్లడించారు.

ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.11,050 కోట్లను జమ చేసినట్లు పేర్కొన్నారు. ధాన్యం తరలింపు, నిల్వ, చెల్లింపుల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ధాన్యం సేకరణలో బిహార్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికులపై ఆధారపడాల్సి వస్తోందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.

బెంగాల్ ఎన్నికల కారణంగా కొంతమంది కార్మికులు స్వస్థలాలకు వెళ్లడంతో వారి రాక ఆలస్యమైందని వివరించారు.

మద్దతు ధర చెల్లింపుల కోసం తమ ప్రభుత్వం రూ.49వేల కోట్లు వెచ్చించిందని, గత ప్రభుత్వం రూ.10వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని పేర్కొన్నారు.

తెలంగాణ దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంగా నిలిచిందని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే ధృవీకరించిందని తెలిపారు.

గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన కొనుగోళ్ల కంటే ప్రస్తుతం అధికంగా ధాన్యం సేకరిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూనే అదనంగా కొనుగోళ్లు చేపట్టామని చెప్పారు.

ఈ ప్రక్రియ కోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో రైతులు తీసుకొచ్చే చివరి గింజ వరకు కొనుగోలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రపంచం అంతా వ్యతిరేకిస్తున్నా భారత్ అండ

**-అమెరికాలో ఇజ్రాయెల్‌కు తగ్గుతున్న ఆదరణ**
**-భారత్ నుంచే తనకు ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారని వ్యాఖ్య**
**-గత భారత పర్యటనను 'లవ్ ఫెస్ట్'గా అభివర్ణించిన నెతన్యాహు**

న్యూఢిల్లీ, మే 29:ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరోసారి భారత్‌పై తనకున్న ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా తమ దేశం ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కానీ భారత్‌లో మాత్రం తమకు అద్భుతమైన మద్దతు లభిస్తోందని అన్నారు. గురువారం వెస్ట్ బ్యాంక్‌లో జరిగిన ఒక సదస్సులో మాట్లాడుతూ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "భారత్ ఒక అతిపెద్ద శక్తి. ఆ దేశంతో మాకు ఒక ప్రత్యేకమైన సంబంధం ఉంది. ప్రపంచంలోని చాలా దేశాల్లో మా ప్రతిష్ఠకు సవాలు ఎదురవుతోంది. కానీ, ఇండియాలో మాత్రం మాకు ఎలాంటి సమస్యా లేదు. అక్కడ ఇజ్రాయెల్ పట్ల ప్రజల్లో పిచ్చి అభిమానం ఉంది. అది నిజంగా అసాధారణం" అని నెతన్యాహు పేర్కొన్నారు. ప్రపంచంలో మరే దేశం నుంచి లేనంతగా, భారత్ నుంచే తనకు ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారని ఆయన తెలిపారు.

నెతన్యాహుకు అమెరికాలో తగ్గుతున్న ఆదరణ

అయితే, అంతర్జాతీయంగా ముఖ్యంగా అమెరికాలో నెతన్యాహు ప్రజాదరణ తగ్గుతున్న సమయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఏప్రిల్‌లో ప్యూ రీసెర్చ్ సెంటర్ విడుదల చేసిన సర్వే ప్రకారం అమెరికాలో 60 శాతం మందికి ఇజ్రాయెల్‌పై ప్రతికూల అభిప్రాయం ఉంది. గత ఏడాది ఇది 53 శాతంగా ఉండేది. అలాగే, 59 శాతం అమెరికన్లు నెతన్యాహు అంతర్జాతీయ వ్యవహారాల్లో సరైన నిర్ణయాలు తీసుకుంటారనే నమ్మకం లేదని వెల్లడించారు. గతంలో కూడా నెతన్యాహు అనేక సందర్భాల్లో భారత్‌పై ప్రశంసలు కురిపించారు. 2018లో తన భార్య సారాతో కలిసి భారత్‌లో పర్యటించినప్పుడు తనకు లభించిన ఆదరణను ఆయన 'లవ్ ఫెస్ట్' (ప్రేమ పండుగ)గా అభివర్ణించారు. భారతీయులకు ఇజ్రాయెల్ పట్ల అపారమైన గౌరవం ఉందని ఆయన పలుమార్లు చెప్పారు.

పాకిస్థాన్‌పై ఆరోపణ

ఇదే సమయంలో అమెరికాలో తన ఆదరణ తగ్గడానికి పాకిస్థాన్ కారణమని నెతన్యాహు ఆరోపించారు. అమెరికా-ఇజ్రాయెల్ సంబంధాలను దెబ్బతీయాలనుకునే దేశాలు సోషల్ మీడియాలో బాట్ ఫామ్స్ ద్వారా ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయని ఆయన అన్నారు. "పాకిస్థాన్‌లోని బేస్‌మెంట్‌లో కూర్చున్న ఎవరో ఒక వ్యక్తి, 'నేను ఇజ్రాయెల్ మద్దతుదారుడిని, కానీ ఇప్పుడు వారిని భరించలేకపోతున్నాను' అని పోస్టులు పెడుతున్నారు" అంటూ ఆయన ఆరోపణలు గుప్పించారు.

# రైతులకు ఇబ్బంది రానివ్వం

**-యూరియా సరఫరాపై కేంద్రాన్ని నిలదీస్తాం**



హైదరాబాద్, మే 29: రాష్ట్రంలో యూరియా కొరత తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. భవిష్యత్తులో వ్యవసాయ సీజన్‌లో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడే పరిస్థితి వస్తే సహించబోమని హెచ్చరించారు.

యూరియా రాష్ట్రంలో తయారయ్యేది కాదని, దాని సరఫరా ప్రక్రియ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటుందని మంత్రి తెలిపారు. తెలంగాణకు అవసరమైన యూరియా పరిమాణంపై వ్యవసాయ శాఖ తరఫున సమగ్ర నివేదిక సిద్ధం చేసి పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులకు లిఖితపూర్వకంగా అందజేస్తామని చెప్పారు.

రాష్ట్రానికి అవసరమైన యూరియాను కేంద్రం నుంచి తెప్పించే పూర్తి బాధ్యత బీజేపీ నాయకులదేనని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. యూరియా సరఫరాలో ఏ విధమైన జాప్యం జరిగినా తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తితే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నాయకత్వాన్ని నిలదీస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# బీజేపీపై తుమ్మల విమర్శల వెల్లువ

**ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీ నేతలు**



హైదరాబాద్, మే 29:తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల అంశంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భారతీయ జనతా పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజలు ఏమనుకుంటారనే కనీస బాధ్యత, ఇంగిత జ్ఞానం లేకుండా బీజేపీ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

దేశాన్ని పాలిస్తున్న బీజేపీ తమ పాలనలో ఎప్పుడైనా తెలంగాణలో జరిగిన స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టిందా అని తుమ్మల ప్రశ్నించారు. రైతులు పండించిన ధాన్యాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేసి వారికి మద్దతుగా నిలిచిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. ధాన్యం సేకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం రైతుల పక్షాన పనిచేస్తోందని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం మాత్రమే కాకుండా, ఆ ధాన్యాన్ని కొనుగోలు చేసే పూర్తి బాధ్యత కూడా కేంద్రానిదేనని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు నష్టం కలగకుండా ధాన్యాన్ని సేకరించి, అవసరమైన ప్రాంతాలకు పంపిణీ చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. కష్టం వచ్చినా, నష్టం వచ్చినా రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ విషయంలో బీజేపీ నేతలు రాజకీయ విమర్శలు మానుకుని వాస్తవాలను గుర్తించాలని తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

# ఆర్ఎమ్‌యూకి రైళ్ల తయారీ బాధ్యత.. ప్రధానికి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు..

హైదరాబాద్, మే 29:కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతర సహకారం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు.

రాబోయే ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీనిపై సమీక్ష నిర్వహించి, ఆ బాధ్యతను కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు అప్పగిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. ఈ ఇంటర్‌సిటీ రైళ్లు 20 కోచ్‌ల కాన్ఫిగరేషన్‌తో, ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్, సురక్షితమైన కోచ్ డిజైన్ వంటి ఆధునిక సదుపాయాలను కలిగి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వీటిని సాధారణంగా సుమారు 300 కిలోమీటర్ల దూరం ఉన్న మార్గాల్లో నడిపిస్తారని తెలిపారు. అలాగే ప్రతి ట్రిప్‌లో చాలా స్టాప్‌లు ఉంటాయని కేంద్ర మంత్రి చెప్పారు. ఇంటర్‌సిటీ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణాలు, నగరాల మధ్య ప్రజలు సులభంగా ప్రయాణించేందుకు ఈ రైళ్లు ఉపయోగపడతాయని అన్నారు. ఇవి తమ సమీప పట్టణాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు. అలాగే ఆరోగ్యం, ఉద్యోగం, ఉపాధి కోసం ప్రయాణించే సామాన్య ప్రజలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

# కాకర్ల పాలగుట్టపై వైభవంగా సంతాన వేణుగోపాల స్వామి మాస కళ్యాణం



ఖమ్మం, మే 29: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామ సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పాల గుట్టపై స్వయంభూగా వెలసిన శ్రీ రుక్మిణీ సహిత సంతాన వేణుగోపాల స్వామి వారి మాస కల్యాణ మహోత్సవం శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా జరిగింది. ఆలయ వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా ఈ కళ్యాణ క్రతువును నిర్వహించారు. స్వామి వారి మాస కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన పీటలపై ఆసీనులైన భక్తులు భక్తిపారవశ్యంతో కల్యాణ వేడుకను కనులారా తిలకించారు. కాకర్ల గ్రామానికి చెందిన చావా వెంకట రామారావు ఉమా వరలక్ష్మి దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవం అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకలో ఆలయ కమిటీ చైర్మన్ ఢిల్లి వెంకటేశ్వర్లు, శ్రీకృష్ణ సేవా సమితి సభ్యులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేపట్టారు.

# కల్తీ మద్యం సేవించి 12 మంది మృతి.. కొందరి పరిస్థితి విషమం



ముంబై, మే 29: కల్తీ మద్యం సేవించి 12 మంది మరణించారు. అస్వస్థత చెందిన మరి కొందరి వ్యక్తుల పరిస్థితి విషమంగా ఉన్నది. కల్తీ మద్యానికి సంబంధించి 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని పూణె జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పూణే, పరిసర ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యక్తులు కల్తీ మద్యం తాగారు. తీవ్ర అస్వస్థతకు గురై 12 మంది మరణించారు. పింప్రి- చించ్వాడ్‌లోని పుగెవాడి ప్రాంతంలో ఏడుగురు, హడప్సర్‌లోని ససనే నగర్, కాలేపడల్ ప్రాంతానికి చెందిన మరో ఐదుగురు చనిపోయారు. అనారోగ్యం పాలైన మరికొందరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాగా, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఈ సంఘటనపై స్పందించారు. సమగ్ర విచారణ చేయాలని పూణే, పింప్రి-చించ్వాడ్ పోలీస్ కమిషనర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కల్తీ మద్యం నెట్‌వర్క్‌ను అధికారులు గుర్తించారని, దీంతో మరిన్ని అరెస్ట్‌లు జరిగే అవకాశమున్నదని వివరించారు.

# ఈనెల 31న ఆర్టీసీ ఉద్యోగులు డిమాండ్ డే ను పాటించాలి : జేఏసీ పిలుపు



హైదరాబాద్, మే 29: రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ డే ను పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో-కన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు.

గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు. కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు.

ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎం.ఎస్.అలీ, డి.గోపాల్, జె.రాఘవులు, బుద్ధ విశాల్, మనోహర్, ఎ.ఎస్.రెడ్డి, జనార్దన్, వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# 'ఎంజీయూలో ఔట్‌సోర్సింగ్ అక్రమ నియామకాలపై విచారణ చేపట్టాలి'

**-ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు విద్యార్థి నాయకుల వినతి**

నల్గొండ, మే 29:నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో చేపట్టిన ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో అక్రమాలపై విచారణ జరిపించాల్సిందిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డిని వర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వర్సిటీ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు వాడపల్లి నవీన్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇటీవల చేపట్టిన ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని ఈ సందర్భంగా వారు ఆరోపించారు. రోస్టర్ రిజర్వేషన్ విధానం పాటించకుండా, పత్రిక ప్రకటనలు సరైన విధంగా ఇవ్వకుండా, అర్హులైన నిరుద్యోగులకు అవకాశం లేకుండా నియామకాలు చేపట్టినట్లు తెలిపారు.

ఇప్పటికే ఈ అంశంపై యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందించకపోవడంతో ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి వివరాలు తెలియజేసినట్లు వెల్లడించారు. విద్యార్థి సంఘం నాయకుడు వాడపల్లి నవీన్ మాట్లాడుతూ.. గతంలో నవీన్ మిట్టల్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న సమయంలో కూడా 33 మంది డైలీవేజ్ ఉద్యోగులను రోస్టర్ రిజర్వేషన్, పత్రిక ప్రకటనలు లేకుండా అక్రమంగా నియమించారని తెలిపారు.

ప్రస్తుతం చేపట్టిన నియామకాలలో కూడా నిరుద్యోగుల వద్ద నుండి లక్షల రూపాయలు వసూలు చేసి 100కు పైగా అక్రమ నియామకాలు చేపట్టినట్లు ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఆ ఏజెన్సీకి యూనివర్సిటీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనులు ఇవ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం జరిగిన నియామకాలను పూర్తిగా రద్దు చేసి, తిరిగి పారదర్శకంగా నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి నాణ్యత కలిగిన విద్యావంతులను ఎంపిక చేయాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ జిట్టా బాలకృష్ణ రెడ్డి విద్యార్థుల ఫిర్యాదులను స్వీకరించి, ఈ అంశంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా యూనివర్సిటీ అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు విద్యార్థి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పోలగోని శివ, రాజేష్, యశ్వంత్, రామ్, జితేందర్, సంజీవ పాల్గొన్నారు.

# మూడు నెలల్లో తీర్పు ఇవ్వాల్సిందే.. రిజర్వ్ తీర్పులపై హైకోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మే 29: కేసుల విచారణ అనంతరం తీర్పు రిజర్వ్ చేసిన తర్వాత మూడు నెలల్లోగా తుది తీర్పు వెల్లడించాలని హైకోర్టులకు సుప్రీంకోర్టు సూచించింది. తీర్పు ఆలస్యం కావడం వల్ల పిటిషన్‌దారులకు తీవ్ర నష్టం జరుగుతుందని కోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై శుక్రవారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశంలోని అన్ని హైకోర్టులు విచారణ అనంతరం తీర్పు రిజర్వ్ చేసిన తర్వాత మూడు నెలల్లోగా తీర్పు వెల్లడించాలని ఆదేశించింది.

రిజర్వ్ చేసిన తేదీ నుంచి తుది తీర్పు కోసం గరిష్ఠంగా మూడు నెలలు మాత్రమే సమయం తీసుకోవాలని సూచించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత, జస్టిస్ జోయ్‌మాల్యా ఆధ్వర్యంలోని బెంచ్ తాజా ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. హైకోర్టులు బెయిల్ దరఖాస్తుకు సంబంధించిన కేసుల్లో విచారణ అనంతరం తీర్పును అదే రోజు వెల్లడించాలి. ఒకవేళ తీర్పు రిజర్వ్ చేస్తే మరుసటి రోజే తీర్పు ఇవ్వాలి. అలాగే, బెయిల్‌పై తీర్పు వెలువడిన వెంటనే ఈ ఆదేశాల్ని జైలు అధికారులకు త్వరగా అందేలా చూడాలి. బెయిల్, రిలీజ్ ఆదేశాలు పొందిన వారు వీలైతే అదే రోజు విడుదలయ్యేలా చూడాలి. ఒకవేళ ఆలస్యమైతే కనీసం మరుసటి రోజైనా విడులయ్యేలా చూడాలి. కింది కోర్టులు కూడా ఈ ఆదేశాల్ని పాటించాలి.

# హిందీ జర్నలిజానికి 200 ఏండ్ల ఘన చరిత్ర

## (30 మే "హిందీ జర్నలిజం దినోత్సవం" సందర్భంగా)

రెండు దశాబ్దాలకు పూర్వం ఆంగ్లం, పార్సియన్ లాంటి భాషల్లో మాత్రమే పాఠకులకు పత్రికలు అందుబాటులో ఉండేవి. హిందీ భాష అత్యధికంగా మాట్లాడే భారతంలో నాడు హిందీలో పత్రికలు ఉండేవి కాదు. ఈ లోటును గ్రహించిన కాన్పూర్‌కకు చెందిన పండిట్ జుగల్ కిషోర్ శుక్లా 30 మే 1826 రోజున కొల్‌కతాలో తొలిసారిగా "ఉదంత్ మార్తాండ్ (ఉద్యమించే సూర్యుడు)" అనే వార పత్రికను అందుబాటులోకి తేవడంతో భారతీయ భాషల్లో పత్రికల విప్లవం ప్రారంభమైంది. ఈ మహత్తర సంఘటనకు గుర్తుగా ప్రతి ఏట 30 మే రోజున "హిందీ జర్నలిజం దినోత్సవం (హిందీ జర్నలిజమ్ డే)"ను పాటించుట ఆనవాయితీగా మారింది. ఈ వేదిక ఆధారంగా హిందీ జర్నలిస్టులు, ఎడిటర్లు, ఫోటోగ్రాఫర్లు, కరస్పాండెంట్లు లాంటి వర్గాల త్యాగాలు, అంకితభావాలను గుర్తు చేసుకోవడంతో పాటు విధి నిర్వహణలో ప్రాణాలు సహితం కోల్పోయిన వారికి నివాళులు అర్పించడం జరుగుతుంది. నేటి హిందీ జర్నలిజం దినోత్సవానికి ఓ ప్రత్యేకత ఉంది. రెండు శతాబ్దాల హిందీ జర్నలిజం ఘన చరిత్రను నేడు పాఠకులు గుర్తు చేసుకునే శుభ సందర్భంగా జరుపుకోవాలి.

### చిన్న ప్రయత్నం ఓ పెద్ద విప్లవానికి నాంది:

నాడు హిందీ పాఠకులు తక్కువగా ఉండడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కేవలం 79 వారాలు మాత్రమే పత్రికలను విడుదల చేసి ఆ తర్వాత ఆపి వేయడం జరిగింది. అయినప్పటికీ నాడు జుగల్ కిషోర్ శుక్లా నాటిన చిన్న హిందీ పత్రిక బీజం కాలక్రమంలో విస్తరించి నేడు పాఠకులకు అనేక రకాలైన పత్రికలు, ఆన్‌లైన్ పత్రికలు, టీవీ చానెల్స్ లాంటివి అందుబాటులోకి రావడం జరిగింది. పత్రిక అంటే సమాచార వితరణ మాత్రమే కాదని, ఇవి ప్రజలను ఏకం చేసే శక్తివంతమైన మాద్యమాలని, సమస్యలను పరిష్కరించే వేదికలని తెలుసుకోవాలి. నేటి పత్రికలు మానవ హక్కులు, సజావుగా ఎన్నికల నిర్వహణ, విద్య, సమకాలీన అంశాలు, రాజకీయం, సామాజిక సమస్యలను బహిరంగ పరిచే వేదికలుగా అమూల్య సేవలను అందిస్తున్నాయి.

### డిజిటల్ స్మార్ట్ యుగంలో పత్రికల మనుగడ:

1826లో ప్రారంభమైన తొలి హిందీ పత్రిక తర్వాత దినదినం అభివృద్ధి చెందుతూ నేడు వందల, వేల పత్రికలు అందుబాటులోకి వచ్చాయి దైనిక్ జగరన్, అమర్ ఉజాల, హిందూస్థాన్, రాజస్థాన్ పత్రిక లాంటివి అనేకం పాఠకులకు సమాచార, విద్య, విజ్ఞాన, సామాజిక చైతన్య విందులను వడ్డిస్తున్నాయి. 1990ల్లో హిందీ టివీ చానెల్స్ అందుబాటులోకి రావడం, తర్వాత యూట్యూబ్ చానెల్స్, మొబైల్ ఆప్‌లు లాంటి రావడంతో నేడు అరచేతిలో అన్ని పత్రికలు ఇమిడిపోయాయి.

హిందీ జర్నలిజం దినం వేదికగా యూనివర్సిటీలు, పత్రికా సంస్థలు, ప్రెస్ క్లబ్‌లు, పాఠక సంఘాలు పలు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలి. డిజిటల్ ఏఐ టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతున్న వేళ నేడు పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతూ పలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి.

నీతి నిజాయితీ, జవాబుదారీతనం, ప్రజా సేవ అనే పునాదుల మీద జర్నలిజం నిలబడాలి. పత్రికలు పక్షపాతంతో దారి తప్పితే ప్రజలకు భారీ నష్టం జరుగుతుంది. చీకటిలో బతుకుతున్న అభాగ్యుల జీవితాల్లో పత్రికలు వెలుగులు నింపాలి. ప్రతి వార్తను క్షణాల్లో అందిస్తున్న డిజిటల్ విప్లవంతో పత్రికల మనుగడ మసకబారరాదు. పత్రికల ప్రాధాన్యాన్ని ప్రత్యామ్నాయం లేదని గమనించాలి. పత్రికలు పోషించడానికి ప్రజలు పాఠకులుగా మారి ముందుకు రావాలి.



-మధుపాళీ
9949700037

# ప్రజాస్వామ్య చైతన్యాన్ని పటిష్ఠపరచడంలో పార్లమెంటరీ వారసత్వ పరిరక్షణ పాత్ర ఎంతో కీలకం: లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ, మే 29:భారత ప్రజాస్వామ్య వ్యవస్థ యావత్ ప్రపంచానికే దారిదీపంగా నిలుస్తోందని లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ఈ రోజు వర్ణించారు. చర్చలు, భాగస్వామ్యం, రాజ్యాంగ విలువలకు భారత ప్రజాస్వామ్య వ్యవస్థ పట్టం కడుతూ, ప్రపంచ దేశాలకు స్ఫూర్తిని అందిస్తోందని కూడా ఆయన అన్నారు.

కేంద్ర చట్టసభ (1924 -1930) కార్యకలాపాలకు సంబంధించిన 89 సంపుటాల ఆవిష్కరణతో పాటు, 'విధాన్-చేతన' త్రైమాసిక పత్రిక తొలి సంచికను కూడా విడుదల చేయడానికి న్యూఢిల్లీలోని ఢిల్లీ విధానసభలో ఈ రోజు ఏర్పాటు చేసిన ఒక సభను ఉద్దేశించి శ్రీ ఓం బిర్లా ప్రసంగించారు. సమాచారాన్ని తెలుసుకొని మరీ చర్చించడం, వాస్తవాలపై ఆధారపడిన చర్చలతో పాటు క్రియాశీల ప్రజా భాగస్వామ్యం ద్వారానే ప్రజాస్వామిక సంస్థలు తమ సిసలైన బలాన్ని సమకూర్చుకుంటాయని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాబోయే తరాలలో ప్రజాస్వామిక చైతన్యాన్ని బలోపేతం చేయడానికి భారత్ పార్లమెంటరీ వారసత్వాన్ని సంరక్షించుకోవడమే కాకుండా ఆ వారసత్వంపై లోతైన అధ్యయనాన్ని నిర్వహించడం కూడా ఎంతో అవసరమని ఆయన సూచించారు.

ఢిల్లీ విధాన సభా భవనం భారత ప్రజాస్వామిక చైతన్యానికి, పార్లమెంటరీ సంప్రదాయాలకు, స్వాతంత్ర్య ఉద్యమానికే కాకుండా వైభవోపేత వారసత్వానికి కూడా సజీవ ప్రతీకగా విరాజిల్లుతోందని లోక్‌సభ స్పీకర్ అన్నారు. విధాన సభా భవన సముదాయానికి ఉన్న చరిత్రాత్మక ప్రాధాన్యాన్ని ఆయన స్మరించుకుంటూ, ఈ భవనం భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రాథమిక దశకు సాక్షిగా నిలిచిందన్నారు. దేశ స్వాతంత్ర్య సమర యోధులతో పాటు జాతీయ నేతలు ప్రాతినిధ్యం, హక్కులు, స్వపరిపాలన కోసం రాజ్యాంగబద్ధ కోర్కెలను ఎలుగెత్తి చాటిన వేదికగా కూడా ఇది ఒక ప్రధాన పాత్రను పోషించిందని ఆయన వివరించారు.

కేంద్ర చట్టసభ ప్రథమ భారతీయ స్పీకర్ శ్రీ విఠల్‌భాయి పటేల్ సేవలను శ్రీ బిర్లా గుర్తుచేస్తూ, ప్రజాస్వామ్య మర్యాద, నిష్పాక్షికత్వం, అధ్యక్ష స్థానానికి ఉన్న గౌరవాలకు ఆయన ఒక బలమైన పునాదిని వేశారన్నారు. వలసవాద పాలన కాలంలో శ్రీ పటేల్ ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ, ఈ చట్టసభ స్వయంప్రతిపత్తిని, ప్రతిష్ఠ నీ నిలబెట్టారని శ్రీ బిర్లా కొనియాడారు. శ్రీ విఠల్‌భాయి పటేల్ అందించిన ఈ సేవలు దేశవ్యాప్తంగా ప్రిసైడింగ్ అధికారులకు, పార్లమెంటు సభ్యులకు, శాసన సభ్యులకు ఎల్లవేళలా స్ఫూర్తిని ఇస్తూ ఉంటాయన్నారు.

తర్కం, గంభీరత్వం, వాస్తవాలపై ఆధారపడి సాగే మాటామంతీ, చర్చలు.. ఇవి ప్రజాస్వామిక సంస్థల గౌరవాన్ని పరిరక్షించగలుగుతాయని, ప్రజా విశ్వాసాన్ని బలపరచగలుగుతాయని లోక్‌సభ స్పీకర్ స్పష్టం చేశారు. భారత ప్రజాస్వామ్య సంస్కృతికి చర్చలు, ఏకాభిప్రాయసాధన, అర్థవంతమైన సంప్రదింపులు మూలస్తంభాలుగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కారణంగా, పార్లమెంటుతో పాటు రాష్ట్రాల చట్టసభలు సదా దేశ ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించే సర్వోన్నత వేదికలుగా వ్యవహరించాలని ఆయన కోరారు.

పరిపాలనలో, చట్టసభల పనితీరులో సాంకేతికత ప్రాధాన్యాన్ని శ్రీ బిర్లా వివరించారు. డిజిటలీకరణ, (ఎలక్ట్రానిక్స్ ఆధారిత) 'ఈ-చట్టసభ'లు, కృత్రిమ మేధ (ఏఐ) వంటి సరికొత్తగా తెర మీదకు వచ్చిన సాంకేతికతలు విధాన రూపకల్పన, చట్టసభలకు సంబంధించిన పరిశోధనను ఇదివరకటి కన్నా ఎక్కువ పారదర్శకత్వం కలిగి ఉండే, సమర్థ, సులభతర ప్రక్రియగా తీర్చిదిద్దాయని ఆయన అన్నారు. ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో, శ్రీ బిర్లా కేంద్ర చట్టసభ కార్యకలాపాలకు సంబంధించిన 89 సంపుటాలతో పాటు, 'విధాన్- చేతన' తొలి సంచిక ని ఆవిష్కరించారు. కేంద్ర చట్టసభ కార్యకలాపాలను గ్రంథ రూపంలో తీసుకు రావడం ఒక కీలక ప్రగతి ప్రస్థానమని శ్రీ బిర్లా వ్యాఖ్యానించారు. ఈ సంకలనం భావి తరాల వారికి ప్రజాస్వామిక విలువలనూ, పార్లమెంట్ సంప్రదాయాలనూ తెలియజేసే దారిదీపంగా నిలుస్తుందన్న ఆశను ఆయన వ్యక్తం చేశారు. ఈ అరుదైన చర్చలు, సభా కార్యకలాపాలకు ఢిల్లీ విధానసభ చక్కని గ్రంథ రూపాన్ని ఇచ్చి భారత చట్టసభల చరిత్రను పరిరక్షించే దిశగా చాలా ముఖ్యమైన అంతరాన్ని భర్తీ చేసిందని కూడా ఆయన అన్నారు.

'విధాన్-చేతన' పత్రికను తీసుకువచ్చినందుకు శ్రీ బిర్లా ప్రశంసలు కురిపిస్తూ ఇది ఒక ముఖ్య మేధా సంబంధ కార్యక్రమమన్నారు. ఇది పార్లమెంటుకు సంబంధించిన అధ్యయనాన్ని, చట్టసంబంధిత పరిశోధనల్ని, ప్రజాస్వామ్య అవగాహనని మరింత దృఢంగా మారుస్తుందని ఆయన చెప్పారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల మేధాపరమైన సామర్థ్యం ఇలాంటి ప్రయత్నాలతో పెరగడమే కాకుండా, ప్రజాస్వామ్యానికి దిశానిర్దేశం, పౌరులలో చైతన్యం మెరుగుపడతాయని ఆయన అన్నారు. చరిత్రాత్మక సభా కార్యకలాపాలతో పాటు 'విధాన్-చేతన' పత్రికను పరిశోధకులకు, విద్యార్థులకు, పౌరులకు విస్తృత స్థాయిలో డిజిటల్ ఫార్మేట్లలో అందుబాటులోకి తీసుకువస్తారన్న ఆశాభావాన్ని శ్రీ బిర్లా వ్యక్తం చేశారు. భారత పార్లమెంటరీ వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు ప్రజాస్వామిక చేతనత్వానికి సరికొత్త ఉత్సాహాన్ని అందిస్తూ ఈ చరిత్రాత్మక కార్యక్రమాన్ని చేపట్టినందుకు ఢిల్లీ విధాన సభను ఆయన ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ కిరెన్ రిజిజూ, ఢిల్లీ విధాన సభ స్పీకర్ శ్రీ విజేందర్ గుప్తా, ఢిల్లీ మంత్రి శ్రీ పర్వేశ్ సాహిబ్ సింగ్, ఢిల్లీ విధాన సభ డిప్యూటీ స్పీకర్ శ్రీ మోహన్ సింగ్ బిస్త్ కూడా పాల్గొన్నారు.

# వ్యర్థాల ప్రాసెసింగ్‌కు స్థలం సిద్ధం చేయాలి

## -జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

అమరావతి, మే 29: భీమవరం మండలం తాడేరులో ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ (సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్) కొరకు స్థలాన్ని సిద్ధంచేసి పనులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం తాడేరు గ్రామంలో ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కొరకు సమీకరించిన 6.6 ఎకరాల స్థలాని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పనికిరాని ఘన వ్యర్థాలను సేకరించి, వాటిని పర్యావరణానికి హాని కలగకుండా శుద్ధి చేసిన అనంతరం వచ్చిన రద్దును ఉంచే ప్రక్రియ నిర్వహణకు స్థలాన్ని సిద్ధం చేయాలని అన్నారు.

స్థలాన్ని వినియోగంలోనికి తెచ్చే విధంగా స్థలాన్ని శుభ్రం చేసి లెవెలింగ్ చేసి, అనంతరం మట్టితో మెరక చేయాలని మండల తహసిల్దార్ రావి రాంబాబును ఆదేశించారు. స్థలానికి సమీపంలో ఉన్న చెరువు నుంచి వచ్చే నీరు స్థలంలోకి చేరి బురదగా ఉండడం వలన దాన్ని పూర్తిగా అరికట్టాలని అన్నారు. పట్టణ పరిధిలో ఏ చెరువులు వద్ద మట్టి అందుబాటులో ఉన్నదో పరిశీలించి వెంటనే పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రానికి రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ పనులన్నీ వర్షాకాలంలోపులోనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పబ్లిక్ హెల్త్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పనులు వేగవంతం చేయాలని తెలియజేశారు.



ఈ కేంద్రం వినియోగంలోనికి వస్తే ఇళ్లు, పరిశ్రమలు మరియు వాణిజ్య ప్రాంతాల నుండి సేకరించిన చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా విభజించి తడిచెత్తను సేంద్రీయ ఎరువుగా, పొడి చెత్తలో ప్లాస్టిక్, కాగితం, గాజు, ఐరన్ తదితర వస్తువులను వేరుచేయడం జరుగుతుందని అన్నారు. రీసైక్లింగ్ ప్రాసెసింగ్ ద్వారా వ్యర్థాలను కంపోస్ట్ ఎరువుగా మార్చడం, రీసైకిల్ కాని చెత్తను పర్యావరణ నిబంధనల ప్రకారం సురక్షితమైన ల్యాండ్ ఫిల్స్ లో పూడ్చిపెట్టడం జరుగుతుందన్నారు. ఘన వ్యర్థాలను సేకరించడం, శుద్ధి చేయడం మరియు పారవేసే పూర్తి ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కేంద్రాన్ని అందుబాటులోనికి తీసుకువచ్చేందుకు పనులన్నీ పారదర్శకంగా, వేగవంతంగా అన్ని శాఖల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామ చంద్రా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 2026 అండర్ 23 ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో అద్భు ప్రదర్శన కనబరిచిన భారత రెజ్లర్లను అభినందించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మే 29:వియత్నాంలోని డా నాంగ్ నగరంలో జరిగిన 2026 అండర్ 23 ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో అద్భుత ప్రదర్శనను కనబరిచిన భారత రెజ్లర్లను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు అభినందించారు.

ఈ ఛాంపియన్‌షిప్స్‌లో మన పురుషుల ఫ్రీస్టైల్, మహిళల రెజ్లింగ్ జట్లు 'టీమ్ టైటిల్స్' సొంతం చేసుకోవటాన్ని ప్రధాని కొనియాడారు.

పురుషుల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ జట్టు 4 స్వర్ణ పతకాలతో సహా మొత్తం 9 పతకాలను కైవసం చేసుకుందన్న ప్రధాని.. అండర్ 23 ఆసియా ఛాంపియన్‌షిప్స్ చరిత్రలోనే ఇది భారతదేశపు అత్యుత్తమ పతకాల రికార్డు అని పేర్కొన్నారు.

మహిళల రెజ్లింగ్ బృందం కూడా 6 స్వర్ణ పతకాలతో సహా మొత్తం 10 పతకాలను సాధించిందని ఆయన వ్యాఖ్యానించారు.

వీటితో పాటు గ్రెకో-రోమన్ రెజ్లింగ్ జట్టు కూడా మొత్తం 8 పతకాలతో తన చరిత్రలోనే అత్యధిక పతకాలను కైవసం చేసుకుందని ప్రధానమంత్రి ప్రస్తావించారు.

రెజ్లర్లను ప్రశంసించిన ప్రధాని.. భవిష్యత్తులో వారికి మంచి విజయాలు కలగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

"మన రెజ్లర్లు అసాధారణ ప్రదర్శన కనబరిచారు.

వియత్నాంలోని డా నాంగ్ వేదికగా జరిగిన 2026 అండర్ 23 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో మన పురుషుల ఫ్రీస్టైల్, మహిళల రెజ్లింగ్ జట్లు టీమ్ ఛాంపియన్‌షిప్ టైటిళ్లను కైవసం చేసుకున్నాయి.

పురుషుల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ జట్టు 4 స్వర్ణ పతకాలతో కలిపి మొత్తం 9 పతకాలను కైవసం చేసుకుంది. తద్వారా అండర్ 23 ఆసియా ఛాంపియన్‌షిప్ చరిత్రలో భారతదేశపు అత్యధిక పతకాల రికార్డును నమోదు చేసింది. మహిళల రెజ్లింగ్ విభాగంలో 6 స్వర్ణాలతో సహా మొత్తం 10 పతకాలు వచ్చాయి. మరోవైపు గ్రెకో-రోమన్ రెజ్లింగ్ జట్టు సైతం 8 పతకాలతో తన అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేస్తూ సరికొత్త చరిత్ర లిఖించింది.

# ప్రజలకు చేరువగా పీజీఆర్ఎస్

## -కలెక్టర్ చదలవాడ నాగరాణి

అమరావతి, మే 29:ప్రజలకు చేరువగా ప్రభుత్వం ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం చేపట్టిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజల సమస్యలను స్థానికంగానే స్వీకరించి పరిష్కార దశల్లో ఉన్నాయని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వెళ్లి సమయం, అధికారులందరూ నియోజకవర్గానికి రావడం, స్థానిక అధికారులు సమన్వయంతో పనిచేయుడం వల్ల సమస్యల



త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా ఆచంట నియోజకవర్గంలోని వాసవి పెనుగొండలో శుక్రవారం ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఎన్‌వీకేవీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షత వహించగా, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి మరియు హౌసింగ్ పీడీ జి.పిచ్చయ్య, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి తదితర అధికారులు పాల్గొని ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలు, వినతిపత్రాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఒక్కో నియోజకవర్గంలో నాలుగు శుక్రవారాలు ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా, ఆచంట నియోజకవర్గంలో ఇప్పటికే మే 15, మే 22 తేదీలలో రెండు విడతలుగా విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. మే 29న మూడవ విడత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గత రెండు విడతలుగా నిర్వహించిన పీజీఆర్ఎస్ సమావేశాల్లో వరుసగా 212, 229 అర్జీలను స్వీకరించడం జరిగిందని, ఈ రోజు స్వీకరించిన 354 దరఖాస్తులతో కలిపి మొత్తం 795 అర్జీలను స్వీకరించడం జరిగిందని, వీటిలో ఇప్పటి వరకు 133 అర్జీలను పరిష్కరించడం జరిగిందని, మిగతా దరఖాస్తులు వివిధ డబ్బు వృథా చేసుకోకుండా, ప్రభుత్వమే వారి వద్దకు వచ్చి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలను తీసుకురావడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని వివరించారు. అధికారులు ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీని పూర్తిగా చదివి, నాణ్యమైన పరిష్కారం అందించాల్సిన బాధ్యత ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే దరఖాస్తులు చేసుకునే పరిస్థితి రాకుండా సమస్యలను సమగ్రంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో మన ముఖ్యమంత్రి తీసుకునే కొన్ని విప్లవాత్మకమైన నిర్ణయాలలో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం కూడా ఒకటి అన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి అర్జీలు సమర్పించడం ప్రజలకు కొంత ప్రయాసతో కూడుకున్న విషయమని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలోనే పీజీఆర్ఎస్ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసిందన్నారు. జిల్లా స్థాయి పరిష్కారం మరింత వేగవంతంగా, సులభంగా జరుగుతుందని శాసనసభ్యులు తెలిపారు. సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు అధికారులకు అభినందనలు తెలిపారు. నూటికి 70 ? 80 శాతం పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరుకు, 30శాతం దరఖాస్తులు భూతగాధాలు, వ్యక్తిగత సమస్యలు, కోర్టు పరిధిలో ఉన్నవి వస్తున్నాయని అన్నారు. కోర్టు లిటిగేషన్లో ఉన్న ఫిర్యాదులపై కలుగజేసుకోవద్దు అని హితవు పలికారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

కార్యక్రమం ప్రారంభానికి ముందు జిల్లా కలెక్టర్ స్వయంగా వివిధ కౌంటర్ల వద్ద జరుగుతున్న అర్జీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అర్జీదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, సావధానంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు కౌంటర్ల వద్దకు వచ్చినప్పుడు వారికి కూర్చునే సౌకర్యం కల్పించి, ప్రాధాన్యతతో సేవలు అందించాలని ఆదేశించారు. ఎన్నడూ లేని విధంగా ఈసారి నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై తమ సమస్యలను తెలియజేయడం విశేషంగా నిలిచింది. ప్రజల స్పందన కార్యక్రమం పట్ల ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జన్‌జాతి సురక్షా మంచ్ ప్రతినిధులతో ప్రధానమంత్రి భేటీ

న్యూఢిల్లీ, మే 29:జన్‌జాతి సురక్షా మంచ్ ప్రతినిధులతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో ఈ రోజు సమావేశమయ్యారు.గిరిజన సమాజం పట్ల వారు కనబరుస్తున్న అంకిత భావాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు.

మాటామంతీలో భాగంగా, గిరిజన సముదాయాల అభివృద్ధితో, సాధికారతతో ముడిపడిన వివిధ అంశాలపై చర్చించారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి శ్రీ మోదీ పొందుపరుస్తూ :

"జన్‌జాతి సురక్షా మంచ్ ప్రతినిధులతో న్యూఢిల్లీలో సమావేశమయ్యే అవకాశం ఈ రోజు లభించింది. గిరిజన సమాజం పట్ల వారికున్న అంకిత భావం ఎంతో ప్రశంసనీయం. గిరిజన సముదాయాల అభివృద్ధి, సాధికారతతో ముడిపడిన వివిధ అంశాలపై ఈ సమావేశంలో అర్థవంతమైన చర్చలు చోటుచేసుకున్నాయి" అని పేర్కొన్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి బాట




అమరావతి, మే 29: కమ్మర్‌పల్లి మండలం లోని కొనసముందర్ గ్రామ రైతు వేదికలో ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాల అభివృద్ధి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని మండల అభివృద్ధి అధికారి రాజా శ్రీనివాస్ ,టీజీబీ చీఫ్ మేనేజర్ విలాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అనంతరం 12 మహిళా సంఘాలకు రూ.2 కోట్ల విలువైన రుణాల చెక్కులను వారి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఎంపిడివో రాజ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు కుటుంబాలకు మాత్రమే పరిమితం కాకుండా ఆర్థికంగా బలపడితే గ్రామాలు,రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి మహిళల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ స్వయం ఉపాధి,చిన్న పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో మహిళలు ముందుకు రావాలని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా భారీ స్థాయిలో రుణాలు అందించడం ద్వారా వారి జీవితాల్లో ఆర్థిక మార్పు తీసుకురావడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

బ్యాంకుల ద్వారా పొందిన రుణాలను వృథా ఖర్చులకు వినియోగించకుండా పాడి పరిశ్రమ,కిరాణా దుకాణాలు,కుట్టు యంత్రాలు,చిన్న వ్యాపారాలు,స్వయం ఉపాధి రంగాల్లో పెట్టుబడులుగా పెట్టి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే పిల్లల విద్య,కుటుంబ సంక్షేమం, గ్రామాభివృద్ధిపై సానుకూల ప్రభావం ఉంటుందని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా నిలుస్తూ గ్రామీణ మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తోందని, మహిళలు కూడా అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెజ్జారం రాకేష్,ఐకేపీ ఏపీఎం కిరణ్ కుమార్,దక్కన్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజ్ కుమార్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మహేందర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెంగల అశోక్,ఐకేపీ సీసీలు అడెల్లి రవి,పీరియా నాయక్, గ్రామ మహిళా సంఘాల అధ్యక్షులు మేఘన, మౌనిక,శృతి,గ్రూప్ లీడర్లు లాడే లత,బండి మమత, జ్యోతి, ద్వాక్రా మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

## -ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
## -ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాబ్ మేళా



అమరావతి, మే 29:పాలకుర్తి నియోజకవర్గం లో ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర స్వామి కళ్యాణ మండపంలో హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఝాన్సీ రాజేందర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పాలకుర్తి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఇది మంచి వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.చదువు పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ప్రైవేట్ రంగంలో అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. నిరుద్యోగ సమస్యలు తగ్గించేందుకు తమ ట్రస్ట్ తరఫున భవిష్యత్తులో కూడా మరిన్ని ఉపాధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఈ మెగా జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థుల అర్హతలను పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందన్నారు.

10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారని,ఉదయం నుంచే యువత కళ్యాణ మండపానికి భారీగా చేరుకొని తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావడం జరిగిందన్నారు.జాబ్ మేళా ప్రాంగణంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వాలంటీర్లు సహాయం అందించారు.యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా కెరీర్ గైడెన్స్, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఏఎంసీ చైర్మన్ లావుడియా మంజుల భాస్కర్,పాలకుర్తి,తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హమ్యా నాయక్,రాపాక సత్యనారాయణ, పాలకుర్తి మండల అధ్యక్షుడు కుమారస్వామి,తొర్రూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, డాక్టర్ పోనుగోటి సోమేశ్వరరావు,జక్కా మహబూబ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు,ట్రస్ట్ సభ్యులు, వాలంటీర్లు, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం..

అమరావతి, మే 29: మండలంలోని చామన్ పల్లి గ్రామ డీసీఎంస్ కేంద్రం వరి ధాన్యం కొనుగోళ్లు శుక్రవారంతో విజయవంతంగా పూర్తిఅయింది. 51250 బ్యాగులు, 60 లారీలు,40 ట్రాక్టర్లలో వరి ధాన్యం తరలించినట్లు నిర్వాహకులు మహిపాల్ రెడ్డి తెలిపారు.సెంటర్ ను విజయవంతంగా పూర్తిచేయడానికి సహకరించిన పిఏసిఎస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, అదనపు జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ , గ్రామ సర్పంచ్ అయిట్ల లక్ష్మి సుదర్శన్ , ఉప సర్పంచ్ గంగారెడ్డి, డీసీఎస్ఓ, డి.సి.ఎం.స్ మేనేజర్, డీసీఎంస్ అధికారులు,సివిల్ సప్లై టీం,ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్, రైతులకు కేంద్రం నిర్వాహకులు మహిపాల్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు ప్రారంభం నుండి తనను వెన్ను తట్టి ప్రోత్సహించిన ఎర్ర రఘునందన్ రెడ్డి కి కేంద్రం నిర్వాహకులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

# సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు

అమరావతి, మే 29: తెలంగాణ రాష్ట్ర సైకిలింగ్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జూన్ 3న ప్రపంచ సైక్లింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణపేట జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు జూన్ 3న, బుధవారం ఉదయం 7 గంటలకు మక్తల్ మినీ స్టేడియం గ్రౌండ్లో నిర్వహిస్తున్నట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తాన్ సింగ్ రాజ్ పురోహిత్,బి. గోపాలం తెలిపా రు. శుక్రవారం మక్తల్ లో ఏర్పా టు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాల బాలికలకు 5 కి మీ,19 సంవత్సరాలు పైబడిన మహిళలకు పురుషులకు 10 కి.మీ. రోడ్ స్పీడ్ సైక్లింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి మెమొంటోస్, మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేస్తామని తెలిపారు.అదేవిధంగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న బాలబాలికలను ఘనంగా సన్మానిస్తామని అధ్యక్ష కార్యదర్శులు తాన్ సింగ్ రాజ్ పురోహిత్ ,బి. గోపాలం తెలిపారు. క్రీడా నైపుణ్యతను ప్రదర్శించిన వారిని ఎంపిక చేసి, రాష్ట్ర జాతీయస్థాయి సైక్లింగ్ క్రీడలకు పంపుతామని వారు తెలిపారు. పి ఈ టి ,పిడిలు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని వారు కోరారు. ఆసక్తిగల బాలబాలికలు స్వంత సైకిల్ తో, ఆధార్ కార్డు, బోనోఫైడ్ తో జూన్ 3న ఉదయం ఏడు గంటలకు మక్తల్ మినీ స్టేడియం గ్రౌండ్లో రిపోర్ట్ చేయాలని వారు తెలిపారు.

# ఘనంగా శత చండీ మహాయాగం ప్రారంభం..



నిజామాబాద్, మే 29: నిజామాబాద్ నగరంలోని న్యాల్కల్ రోడ్డులో గల లలిత ఆశ్రమ ఆలయంలో ఆలయ ధర్మాధికారి రాజేందర్ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న శత చండీ మహాయాగం ఘనంగా ప్రారంభమైంది.

మహాయాగంలో భాగంగా తొలి రోజు గురువందనం, సంతాన పాశుపత పూజ, సుమంగళి మహిళల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సాయంత్రం సహస్ర మోదక గణపతి హవనాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మాధికారి రాజేందర్ శర్మ తెలిపారు. యాగ కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆశీర్వాదాలు పొందాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన పురోహితులు వేలేటి గౌరీశంకర్ శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గాలి నాగరాజు, కొమ్మ సుధాకర్, శేఖర్, కస్తూరి శ్రీనివాస్, మోటూరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# వాతావరణ మార్పుల నుంచి డిజిటల్ వ్యవసాయం దాకా...

# కొత్త వ్యవసాయ రోడ్‌మ్యాప్ రూపొందించనున్న ఖరీఫ్ సదస్సు: శ్రీ చౌహాన్

న్యూఢిల్లీ, మే 29:కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ రోజు న్యూఢిల్లీలోని పూసా క్యాంపస్‌లో ఖరీఫ్ సదస్సు-2026 గురించి విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... దేశంలో ఆహార భద్రతను నిర్ధారించడం, రైతుల జీవనోపాధిని మెరుగుపరచడం, పౌరులకు పౌష్టికాహారాన్ని అందించడం కేంద్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యాలుగా ఉన్నాయన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. జాతీయ ఖరీఫ్ ప్రచారం-2026 పై రెండు రోజుల వ్యవసాయ సదస్సును ఈ నెల 28, 29 తేదీల్లో న్యూఢిల్లీలోని పూసాలో గల ఎన్ఏఎస్సీ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో దేశవ్యాప్త వ్యవసాయ మంత్రులు, శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులతో పాటు ఐసీఏఆర్, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్ సన్నాహాలపై ఈ రెండు రోజుల్లో సవివరమైన చర్చలు, సమీక్షలు నిర్వహిస్తారు.

**ఖరీఫ్ సదస్సులో ఏకమైన 'టీమ్ అగ్రికల్చర్'**

ఈ ఖరీఫ్ సదస్సు 'టీమ్ అగ్రికల్చర్' మొత్తాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చిందని శ్రీ చౌహాన్ అన్నారు. 'టీమ్ అగ్రికల్చర్' అంటే కేవలం కేంద్ర ప్రభుత్వం మాత్రమే కాదనీ... రాష్ట్ర ప్రభుత్వాలు, భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ రంగానికి సంబంధించిన భాగస్వాములందరూ ఇందులో భాగమని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశమనీ, రాష్ట్రాల చురుకైన భాగస్వామ్యంతోనే ఈ రంగంలో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. కేంద్రం మధ్యవర్తిగా, భాగస్వామిగా వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో ఖరీఫ్, రబీ పంటల సన్నాహాలు... నాణ్యమైన విత్తనాల లభ్యత, క్షేత్రస్థాయిలో వివిధ వ్యవసాయ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడం వంటి అంశాలపై చర్చిస్తారని తెలిపారు.

ఈ సమావేశానికి ముందే రాష్ట్రాలతో వీడియో అనుసంధానం ద్వారా సమావేశాలు జరిగాయనీ, ఈ సమావేశాల్లో పలు అంశాలపై విస్తృతంగా చర్చించామనీ కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సంప్రదింపుల ఆధారంగా, రాష్ట్రాలు వారి సన్నద్ధతా ప్రణాళికలతో ఈ సమావేశానికి హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సవాళ్లపై కూలంకషంగా చర్చించడంతో పాటు, సమన్వయ ప్రయత్నాల ద్వారా ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనాలని ఆయన సూచించారు.

గతంలో ఈ సదస్సు ఒక రోజు కార్యక్రమంగా జరిగేది. దేశ పరిమాణం, వైవిధ్యం దృష్ట్యా ఒకే రోజులో సమగ్ర చర్చలు పూర్తి చేయడం సాధ్యపడలేదు. ఈ సంవత్సరం సదస్సు మొదటి రోజున వివిధ రాష్ట్రాల అధికారులు బృందాలుగా ఏర్పడి కూలంకషంగా చర్చలు జరుపుతుండగా... రెండో రోజున రాష్ట్ర వ్యవసాయ మంత్రులు ఈ చర్చల్లో పాల్గొంటారు.

**విభిన్న వ్యవసాయ పరిస్థితుల కోసం ప్రాంతీయ స్థాయి చర్చలు ప్రారంభం**

దేశానికి ఉన్న విస్తారమైన భౌగోళిక, వాతావరణ వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని... ప్రభుత్వం జాతీయ వ్యవసాయ సదస్సుకు మించి సంప్రదింపుల ప్రక్రియను విస్తరించింది. ఇప్పుడు ప్రాంతీయ సదస్సులనూ నిర్వహించడం ప్రారంభించిందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి తెలిపారు. జైపూర్, లక్నో, భువనేశ్వర్‌లలో ఇప్పటికే మూడు ప్రాంతీయ సదస్సులు జరిగాయని ఆయన తెలియజేశారు. ఈశాన్య, దక్షిణ భారత్ కోసం మరో రెండు సదస్సులను ప్రతిపాదించగా... వాటి తేదీలనూ త్వరలోనే ఖరారు చేయనున్నట్లు తెలిపారు.

ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వ్యవసాయ పద్ధతులు, వాతావరణ పరిస్థితులు గణనీయంగా మారుతుంటాయనీ... అందుకే ప్రాంతీయ స్థాయి చర్చలు మరింత ఆచరణాత్మకంగా, ప్రభావవంతంగా ఉంటాయని శ్రీ చౌహాన్ అన్నారు. "రాష్ట్రాలతో చిన్న బృందాలుగా చర్చలు జరిపినప్పుడు... ప్రతి రాష్ట్రానికి సంబంధించిన నిర్దిష్ట సమస్యలు, అవసరాలపై వివరంగా చర్చించడం సాధ్యమవుతుంది" అని ఆయన అన్నారు. భవిష్యత్తులో వ్యవసా య-వాతావరణ మండలాల ఆధారంగా ప్రాంతీయ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు. ఐసీఏఆర్ వర్గీకరణను ప్రస్తావిస్తూ... దేశాన్ని స్థూలంగా ఎనిమిది వ్యవసాయ-వాతావరణ మండలాలుగా విభజించవచ్చని ఆయన అన్నారు. "కేవలం ఐదు మండలాల ఆధారంగా కాకుండా, ఈ ఎనిమిది మండలాల ఆధారంగా ప్రాంతీయ సమావేశాలను నిర్వహించడం కోసమే మా ప్రయత్నం. తద్వారా వ్యవసాయ వ్యూహాలు, పథకాలు క్షేత్రస్థాయికి సమర్థంగా చేరతాయి" అని ఆయన జోడించారు. ఖరీఫ్ సమావేశానికి సంబంధించిన ఒక వివరణాత్మక ప్రజెంటేషన్ సిద్ధం చేశామనీ, ఇందులో వివిధ వ్యవసాయ సంబంధిత అంశాలపై విస్తృత చర్చలు ఉన్నాయని ఆయన తెలియజేశారు.

**గోధుమ, వరి, మొక్కజొన్న, నూనెగింజల పంటల్లో రికార్డు స్థాయి ఉత్పత్తి**

వ్యవసాయ రంగం సాధించిన విజయాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ... రైతుల కృషి, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానపరమైన మద్దతు, శాస్త్రీయ పరిశోధన, రాష్ట్రాల సహకారం వల్ల ఈ ఏడాది ఆహార ధాన్యాల ఉత్పత్తిలో భారత్ గత రికార్డులన్నింటినీ అధిగమించిందని శ్రీ చౌహాన్ అన్నారు. "రైతుల కృషి, ప్రభుత్వ పథకాలు, కొత్తగా అభివృద్ధి చేసిన విత్తన వంగడాల వల్లే ఈ ఏడాది దేశం రికార్డు స్థాయిలో ఉత్పత్తిని సాధించిందని చెప్పడానికి వ్యవసాయ మంత్రిగా నాకు ఎంతో సంతృప్తిగా ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. 2025-26 సంవత్సరానికి భారత మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి అంచనా 376.563 మిలియన్ టన్నులకు చేరుకుందనీ, ఇది గత ఏడాది కంటే దాదాపు 18.8 మిలియన్ టన్నులు అధికమని కేంద్ర మంత్రి తెలిపారు. వరి ఉత్పత్తిలోనూ భారత్ సరికొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. "వరి ఉత్పత్తి 154.024 మిలియన్ టన్నులకు చేరుకుంది. దీంతో భారత్ ఇప్పుడు చైనాను అధిగమించి ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలిచింది" అని ఆయన అన్నారు. గోధుమ ఉత్పత్తి 120.657 మిలియన్ టన్నులకు చేరుకోగా, మొక్కజొన్న ఉత్పత్తి 55.092 మిలియన్ టన్నులుగా నమోదైంది - ఈ రెండూ రికార్డు స్థాయిలేనని కేంద్ర మంత్రి శ్రీ చౌహాన్ వివరించారు.

నూనెగింజల ఉత్పత్తిలోనూ దేశం గణనీయ రికార్డులను సాధించిందని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ ఏడాది నూనెగింజల ఉత్పత్తి 43.059 మిలియన్ టన్నులుగా అంచనా వేశారు. వేరుశనగ ఉత్పత్తి 13.074 మిలియన్ టన్నులకు చేరుకోగా, ఆవాల ఉత్పత్తి 13.768 మిలియన్ టన్నులకు పెరిగింది. ఈ రెండూ రికార్డు స్థాయిలో ఉన్నాయి. పప్పుధాన్యాల ఉత్పత్తి చెప్పుకోదగిన వృద్ధిని నమోదు చేసిందనీ, రాబోయే సంవత్సరాల్లో మరింత పెరుగుదలకు అత్యంత అవకాశం ఉందని ఆయన తెలిపారు.

**ఖరీఫ్ వ్యూహంపై జాతీయ స్థాయి చర్చలు**

పప్పుధాన్యాలు, నూనెగింజల కోసం ప్రత్యేక మిషన్లను ఏర్పాటు చేశామనీ, విత్తన నాణ్యతను మెరుగుపరచడం, విత్తన మార్పిడి రేట్లను పెంచడం, ప్రదర్శనలు, ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంపై రాష్ట్రాలతో విస్తృతంగా చర్చిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. దేశంలో ఉద్యానవన రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, దీనికి అపారమైన సామర్థ్యం ఉందని శ్రీ చౌహాన్ అన్నారు. ఈ సదస్సులో ఉద్యానవన సమగ్ర అభివృద్ధి మిషన్, కాటన్ మిషన్‌పైనా చర్చలు జరుగుతాయన్నారు. వాతావరణ మార్పును వ్యవసాయానికి ఒక ప్రధాన సవాలుగా అభివర్ణిస్తూ... మారుతున్న వాతావరణ సరళి, అస్తవ్యస్తమైన వర్షపాతం వ్యవసాయ పరిస్థితులను వేగంగా మారుస్తున్నాయని కేంద్ర మంత్రి అన్నారు. "ఉష్ణోగ్రతలు నిరంతరం పెరుగుతున్నాయి. ఒకేసారి అధిక వర్షపాతం కురిసి, ఆ తర్వాత సుదీర్ఘకాలం పాటు పొడి వాతావరణం ఉంటున్న సందర్భాలూ ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో వ్యవసాయాన్ని సురక్షితంగా, సుస్థిరంగా మార్చే చర్యలపై చర్చలు అవసరం" అని శ్రీ చౌహాన్ పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయం, భూసార కార్డులు, ఎరువుల సమతుల్య వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు. అవగాహన లోపం కారణంగా చాలా మంది రైతులు ఎరువులను అధికంగా వాడుతున్నారనీ, వాటిని సమతుల్యంగా వాడటం అత్యవసరమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు సమీకృత వ్యవసాయ నమూనాలపై చర్చిస్తామని ఆయన తెలిపారు. "దేశంలో వ్యవసాయ క్షేత్రాల పరిమాణం చిన్నది. అందువల్ల, పరిమిత భూమిలో రైతులు ఎలా అధిక ఆదాయం సంపాదించగలరనే దానిపై చర్చల్లో ప్రధానంగా దృష్టి సారిస్తాం" అని ఆయన అన్నారు.

వ్యవసాయానికి తగినంత ఆర్థిక సహాయం ప్రాముఖ్యతనూ కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. రైతులకు కేవలం పంట ఉత్పత్తికే కాకుండా... పంటల కోతల అనంతర నిర్వహణ, నష్ట నివారణకూ మద్దతు అవసరమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాలవారీగా వ్యవసాయ రుణాల పంపిణీ అసమానంగా ఉందనీ, కొన్ని రాష్ట్రాలు ఇతర వాటి కంటే గణనీయంగా తక్కువ వ్యవసాయ రుణాలను పొందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. "రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, తగినంత పెట్టుబడి మూలధనం అందుబాటులో ఉంటే... వారు మెరుగైన వ్యవసాయ పద్ధతులను చేపట్టగలుగుతారు" అని శ్రీ చౌహాన్ వ్యాఖ్యానించారు.

వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి, పీఎం-ఆశా పథకం, డిజిటల్ వ్యవసాయం, రైతు గుర్తింపు కార్డు (ఫార్మర్ ఐడీ), రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓలను) బలోపేతం వంటి అంశాలపైనా ఈ సదస్సులో చర్చిస్తారని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ చర్చల కోసం రాష్ట్రాలను వేర్వేరు బృందాలుగా విభజించారు. రోజంతా ఈ బృందాల మధ్య సవివరమైన చర్చలు జరుగుతాయి. మరుసటి రోజున, రాష్ట్ర వ్యవసాయ మంత్రుల సమక్షంలో వివిధ వ్యవసాయ అంశాలపై ప్రజెంటేషన్లు ఉంటాయి. ఖరీఫ్ పంట కాలానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఒక ఉమ్మడి వ్యవసాయ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తాయి. 'ఖేత్ బచావో అభియాన్' పైనా ఈ సదస్సులో విస్తృతంగా చర్చిస్తామని శ్రీ చౌహాన్ తెలిపారు. సమష్టిగా నిర్ణయించుకున్న లక్ష్యాలను సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నిహిత సమన్వయంతో పనిచేస్తాయని ఆయన జోడించారు.

# మక్తల్ ఎస్ఐగా పి. రాజు బాధ్యతల స్వీకరణ

అమరావతి, మే 29: మక్తల్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా ఎస్ఐ పి. రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను ఇంతకుముందు దామరగిద్ద ఎస్సైగా బాధ్యతలు నిర్వహించి మక్తల్ ఎస్సైగా బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతకు ముందు మక్తల్ ఎస్సైగా విధులు నిర్వహించిన వై.భాగ్య లక్ష్మి రెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయానికి (విఆర్ ) బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై పి. రాజు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ను ఎస్పీ కార్యాలయంలో పూల మొక్క అందించి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలియజేసి, మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్ అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం, పేకాట, గంజాయి రవాణా, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని ఆయన తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, యువత చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ పి.రాజు సూచించారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ పి.రాజును పలువురు ప్రజాప్రతినిధులు నాయకులు కలుసుకుని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

# ప్రజలకు చేరువగా పీజీఆర్ఎస్

## –కలెక్టర్ చదలవాడ నాగరాణి

అమరావతి, మే 29: ప్రజలకు చేరువగా ప్రభుత్వం ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం చేపట్టిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజల సమస్యలను స్థానికంగానే స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కార దశల్లో ఉన్నాయని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వెళ్లి సమయం, డబ్బు వృథా చేసుకోకుండా, ప్రభుత్వమే వారి వద్దకు వచ్చి అధికారులందరూ నియోజకవర్గానికి రావడం, స్థానిక అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల సమస్యల పరిష్కారం మరింత వేగవంతంగా, సులభంగా



ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా ఆచంట నియోజకవర్గంలోని వాసవి పెనుగొండలో శుక్రవారం ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షత వహించగా, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి మరియు హౌసింగ్ పీడీ జి.పిచ్చయ్య, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి తదితర అధికారులు పాల్గొని ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలు, వినతిపత్రాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఒక్కో నియోజకవర్గంలో నాలుగు శుక్రవారాలు ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా, ఆచంట నియోజకవర్గంలో ఇప్పటికే మే 15, మే 22 తేదీలలో రెండు విడతలుగా విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. మే 29న మూడవ విడత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గత రెండు విడతలుగా నిర్వహించిన పీజీఆర్ఎస్ సమావేశాల్లో వరుసగా 212, 229 అర్జీలను స్వీకరించడం జరిగిందని, ఈ రోజు స్వీకరించిన 354 దరఖాస్తులతో కలిపి మొత్తం 795 అర్జీలను స్వీకరించడం జరిగిందని, వీటిలో ఇప్పటి వరకు 133 అర్జీలను పరిష్కరించడం జరిగిందని, మిగతా దరఖాస్తులు వివిధ సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలను తీసుకురావడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని వివరించారు. అధికారులు ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీని పూర్తిగా చదివి, నాణ్యమైన పరిష్కారం అందించాల్సిన బాధ్యత ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే దరఖాస్తులు చేసుకునే పరిస్థితి రాకుండా సమస్యలను సమగ్రంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో మన ముఖ్యమంత్రి తీసుకునే కొన్ని విప్లవాత్మకమైన నిర్ణయాలలో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం కూడా ఒకటి అన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి అర్జీలు సమర్పించడం ప్రజలకు కొంత ప్రయాసతో కూడుకున్న విషయమని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలోనే పీజీఆర్ఎస్ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసిందన్నారు. జిల్లా స్థాయి జరుగుతుందని శాసనసభ్యులు తెలిపారు. సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు అధికారులకు అభినందనలు తెలిపారు. నూటికి 70 ? 80 శాతం పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరుకు, 30శాతం దరఖాస్తులు భూతగాధాలు, వ్యక్తిగత సమస్యలు, కోర్టు పరిధిలో ఉన్నవి వస్తున్నాయని అన్నారు. కోర్టు లిటిగేషన్లో ఉన్న ఫిర్యాదులపై కలుగజేసుకోవద్దు అని హితవు పలికారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

కార్యక్రమం ప్రారంభానికి ముందు జిల్లా కలెక్టర్ స్వయంగా వివిధ కౌంటర్ల వద్ద జరుగుతున్న అర్జీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అర్జీదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, సావధానంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు కౌంటర్ల వద్దకు వచ్చినప్పుడు వారికి కూర్చునే సౌకర్యం కల్పించి, ప్రాధాన్యతతో సేవలు అందించాలని ఆదేశించారు. ఎన్నడూ లేని విధంగా ఈసారి నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై తమ సమస్యలను తెలియజేయడం విశేషంగా నిలిచింది. ప్రజల స్పందన కార్యక్రమం పట్ల ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కరువు నేలపై వరద సవాలు..

## –వంక బ్రిడ్జిపై ప్రాణాల పణంగా ప్రయాణం
## –మంత్రాలయం సమీపంలో ఉధృతంగా ప్రవహించిన వాగు
## –వరద నీటిలోనే దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
## –ఉత్కంఠగా వీక్షించిన స్థానికులు

అమరావతి, మే 29:నందవరం మండలం మంత్రాలయం సమీపంలో వరద నీటి ఉధృతి మధ్య ఓ ఆర్టీసీ బస్సు వంక బ్రిడ్జిని దాటిన ఘటన కలకలం రేపింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల ప్రభావంతో వాగులోకి భారీగా వరద నీరు చేరి బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుండగా, ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదే మార్గంలో ముందుకు సాగింది.

వాగు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బస్సు సురక్షితంగా దాటుతుందా లేదా అన్న ఆందోళన అక్కడ ఉన్న వారిని వెంటాడింది. బ్రిడ్జి ఇరువైపులా నిలబడ్డ స్థానికులు, వాహనదారులు ఉత్కంఠగా గమనించారు. కొంతసేపు గుండెల్లో గుబులు రేపిన ఈ ఘటనలో డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో బస్సు నెమ్మదిగా ముందుకు కదులుతూ సురక్షితంగా అవతలి ఒడ్డుకు చేరింది.

బస్సు బ్రిడ్జి దాటిన వెంటనే ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో వంకలు, వాగులు, చెక్‌డ్యామ్‌లపై నీరు ప్రవహిస్తున్న సమయంలో ప్రమాదకర ప్రయాణాలను నివారించాలని అధికారులు సూచిస్తున్నారు. నీటి లోతు, ప్రవాహ వేగం అంచనా వేయడం కష్టమవుతుందని, చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వరద నీరు బ్రిడ్జిపై ప్రవహిస్తున్న సమయంలో వాహనాల రాకపోకలపై తాత్కాలిక ఆంక్షలు విధించడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, పోలీసు పహారా పెంచడం వంటి చర్యలను మరింత సమర్థంగా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

"ప్రయాణం కంటే ప్రాణ భద్రతే ముఖ్యం" అనే విషయాన్ని మంత్రాలయం సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది.

# చిన్నారుల విద్యాభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కృషి

## – ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, మే 29: (నేటినిజం ప్రతినిధి): చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదల విద్యా?భివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కృషి చేస్తాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల్లో పాల్గొనీ వేములవాడ పట్టణంలోని శత్రాజ్పల్లి నూతన అంగన్వాడీ కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల ప్రణాళిక పెట్టుకొని ప్రతి వారం ఒక్కో శాఖ ఆధ్వర్యంలో గ్రామ, మండల, నియోజకవర్గ , జిల్లా స్థాయిలో పలు కార్యక్రమాలు చేస్తూ ముందుకు పోతున్నట్లు తెలిపారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తాయని అన్నారు. గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు పోషకాహారం, ప్రాథమిక విద్య అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పసిపిల్లలలో




పోషకాహార లోపాలను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు చిన్నారులకు ప్రాథమిక విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడంలో అంగన్వాడీ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతోందన్నారు. పక్క భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యా విధానంలో సమూల మార్పులు చేపడుతున్నట్లు తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు అయిందని, రూ.200 కోట్లతో 20 ఎకరాల్లో నిర్మిస్తున్నామని వెల్లడించారు. నాణ్యమైన భోజనం, విద్య అందిస్తామని తెలిపారు. కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచామని, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు రానున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గానికి ఒకటి వస్తాయని, ఒక్కో స్కూల్ లో 1500 మంది విద్యార్థులు చదివే అవకాశం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 36 వేల బెడ్స్ ఆసుపత్రుల్లో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. రైతు ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. జగిత్యాల పొలాసా తరహాలో వేములవాడ నియోజకవర్గ పరిధిలో మర్రిపల్లి గ్రామంలో 40 ఎకరాల్లో నూతన రైతు విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసాం అన్నారు. తద్వారా రైతులకు నూతన వ్యవసాయ విధానంలో, నూతన వంగడాలతో రైతులు వ్యవసాయం చేసేలా ప్రోత్సాహకం అందజేయున్నట్లు తెలిపారు. శాత్రాజ్పల్లిలో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రునీ తొందర్లోనే పూర్తి చేసుకొని త్వరలోనే ప్రారంభం చేసుకుందామన్నారు.

# ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం

## –రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి
## –చేతల్లో మాత్రం శూన్యం
## –పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

అమరావతి, మే 29:రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో మాత్రం శూన్యమే కనిపిస్తోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. శుక్రవారం పరకాల,నడికూడ మండలాలకు చెందిన సర్పంచులు, ఉపసర్పంచులతో కలిసి హనుమకొండలోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనుల దుస్థితి, పార్టీ పరిస్థితులపై ,సభ్యత్వ నమోదు కార్యక్రమంపై , ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడితప్పిందన్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వాటి అమలులో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రతిరోజూ కొత్త మాటలు చెబుతున్నారే తప్ప అభివృద్ధి కనిపించడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచాయని, పల్లె ప్రగతి, రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలతో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారాయని గుర్తుచేశారు.

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీలకు నిధులు నిలిపివేసి సర్పంచులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి కనీస సౌకర్యాలు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మాత్రం ప్రకటనలకే పరిమితమైందని మండిపడ్డారు. ప్రజాపాలన పేరుతో ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం అసలు ప్రజల సమస్యలపై కనీస చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులతో ముందుకెళ్తోందని, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం తప్ప రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు.

రైతులు, నిరుద్యోగులు, మహిళలు, గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాబోయే రోజుల్లో ప్రజలే ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై అప్రమత్తంగా ఉండాలని,పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీశ్రేణులు బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల, నడికుడ మండలాల బిఆర్ఎస్ సర్పంచులు,ఉప సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన అక్రమ రవాణా

## –కర్ణాటక సరిహద్దు మార్గంగా తరలింపు
## –కౌతాళంలో భారీగా పెట్రోల్, డీజిల్ స్వాధీనం.
## –రాష్ట్ర ఖజానాకు గండి.. ప్రజల ప్రాణాలకు ముప్పు.

కర్నూలు , మే 29: కర్ణాటక సరిహద్దు మార్గంగా కర్నూలు జిల్లాలోకి అక్రమంగా చేరుతున్న పెట్రోల్, డీజిల్ వ్యాపారంపై పౌరసరఫరాల శాఖ కొరడా ఝుళిపించింది. కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 1210 లీటర్ల ఇంధనాన్ని స్వాధీనం చేసుకోవడం జిల్లాలో అక్రమ ఇంధన రవాణా ఎంతగా విస్తరించిందనే అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. రాష్ట్ర ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే ఈ అక్రమ వ్యాపారంపై అధికారులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు.



కర్ణాటక రాష్ట్రం నుంచి తక్కువ ధరలకు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసి కర్నూలు జిల్లాలో అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్న ముఠాలపై పౌరసరఫరాల శాఖ ఉక్కుపాదం మోపింది. కౌతాళం మండలంలోని ఉరుకుంద గ్రామంలో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో భారీ మొత్తంలో ఇంధన నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జిల్లాలో సరిహద్దు ప్రాంతాల్లో కొనసాగుతున్న అక్రమ ఇంధన వ్యాపారంపై మరోసారి చర్చకు దారి తీసింది.

విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్ ఆదేశాల మేరకు అధికారులు రెండు ప్రైవేటు ప్రాంగణాలపై దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 1060 లీటర్ల డీజిల్, 150 లీటర్ల పెట్రోల్ అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. మొత్తం 1210 లీటర్ల ఇంధనాన్ని స్వాధీనం చేసుకుని నిత్యావసర వస్తువుల చట్టం-1955లోని సెక్షన్ 6-ఏ కింద కేసులు నమోదు చేశారు. అనంతరం పూర్తి వివరాలను జాయింట్ కలెక్టర్‌కు నివేదించారు.

కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో కొంతకాలంగా ఇంధన ధరల్లో తేడాను ఆసరాగా చేసుకుని అక్రమ వ్యాపారాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఇంధనాన్ని చిన్న చిన్న ట్యాంకర్లలో, డ్రమ్‌లలో లేదా ఇతర వాహనాల ద్వారా తరలించి గ్రామీణ ప్రాంతాల్లో నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఉరుకుందలో బయటపడిన వ్యవహారం ఈ అక్రమ రవాణా నెట్‌వర్క్ ఎంత విస్తృతంగా ఉందో సూచిస్తోందని అధికారులు భావిస్తున్నారు.

ఇలాంటి అక్రమ ఇంధన విక్రయాల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రావలసిన వ్యాట్ (వ్యాట్) ఆదాయం గణనీయంగా తగ్గిపోతుందని అధికారులు చెబుతున్నారు. చట్టబద్ధంగా విక్రయించే పెట్రోల్ బంకులను పక్కనబెట్టి అక్రమ మార్గాల్లో ఇంధనం విక్రయించడం వల్ల ప్రభుత్వ ఆదాయం తగ్గడమే కాకుండా చట్టబద్ధ వ్యాపారులు కూడా నష్టపోతున్నారు. దీర్ఘకాలంలో ఇది ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

అక్రమ వ్యాపారులు సాధారణంగా కిరాణా దుకాణాలు, చిన్న గోదాములు, నివాస గృహాల్లోనే పెట్రోల్, డీజిల్ నిల్వ ఉంచుతున్నట్లు అధికారులు గుర్తిస్తున్నారు. అత్యంత మండే స్వభావం కలిగిన ఈ ఇంధనాలను భద్రతా ప్రమాణాలు లేకుండా నిల్వ చేయడం వల్ల ఎప్పుడైనా అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉంది. ఒక చిన్న నిర్లక్ష్యం భారీ ప్రాణనష్టం, ఆస్తినష్టానికి దారి తీసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ఐబీసీ పరిష్కార ప్రక్రియ ద్వారా రుణదాతలకు సులభతరమైన రూ. 4 లక్షల కోట్లకు పైగా బకాయిల వసూలు

న్యూఢిల్లీ, మే 29:2016లో అమల్లోకి వచ్చిన దివాలా, రుణ విమోచన చట్టం నేటితో విజయవంతంగా 10 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ చట్టం అమల్లోకి వచ్చి దశాబ్ద కాలం పూర్తయిన నేపథ్యంలో ఇది కేవలం ఒక సాధారణ చట్టపరమైన సంస్కరణగా మాత్రమే కాకుండా.. రుణ మార్కెట్లు, కార్పొరేట్ ప్రవర్తన, పెట్టుబడిదారుల నమ్మకం, ఆర్థిక సామర్థ్యంపై దీర్ఘకాల ప్రభావాలను చూపిన ఒక వ్యవస్థాగత మార్పుగా అవతరించింది.

చారిత్రాత్మక సంస్కరణగా కొనియాడుతున్న ఈ చట్టాన్ని.. అప్పటి వరకు దేశంలో విచ్ఛిన్నంగా ఉన్న దివాలా పరిష్కార వ్యవస్థలను ఏకీకృతం చేసి, ఆధునికీకరించాలనే లక్ష్యంతో రూపొందించారు. ఈ చట్టం అమలుతో బకాయిలను వసూలు చేసే యంత్రాంగాలు మెరుగయ్యాయి. బాధ్యతాయుతంగా అప్పులు తీసుకునే, ఇచ్చే పద్ధతులు పెరిగాయి. దేశ ఆర్థిక, న్యాయ వ్యవస్థలపై నమ్మకం మరింత బలోపేతమైంది.

మార్చి 2026 నాటికి 1,419 కేసులు విజయవంతంగా పరిష్కారం పొందడం ఈ చట్టం అమలుకు స్పష్టమైన నిదర్శనం. ఈ పరిష్కార ప్రక్రియ ద్వారా రుణదాతలకు రూ. 4 లక్షల కోట్లకు పైగా బకాయిలు వసూలయ్యాయి. రుణదాతలకు లభించిన ఈ బకాయిల వసూలు మొత్తం సంస్థల విలువ, విక్రయ విలువలతో పోలిస్తే వరుసగా 95 శాతం, 167 శాతంగా ఉంది.

నేడు ఈ దివాలా చట్టం ఆధారంగా వస్తున్న కోర్టు తీర్పులు ఒక బలమైన, వేగవంతమైన వ్యవస్థ ఏర్పడటానికి సహాయపడ్డాయి. ఈ వ్యవస్థ మారుతున్న ఆర్థిక పరిస్థితులకు, అలాగే వ్యాపారుల నమ్మకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మారుతూ ముందుకు సాగుతోంది.

మార్చి 2026 వరకు మొత్తం 8,987 కేసులు విచారణకు స్వీకరించగా వాటిలో 7,102 కేసులు ముగింపు దశకు చేరుకున్నాయి. ముగిసిన కేసుల్లో దాదాపు 58 శాతానికి సమానమైన 4,099 కంపెనీలు దివాలా తీయకుండా రక్షణ పొందాయి. మరో 3,003 కేసులు కంపెనీ ఆస్తుల విక్రయంతో ముగిశాయి.

దివాలా తీయకుండా రక్షించిన సంస్థల్లో 1,388 కేసులు అప్పీల్, సమీక్ష, రాజీ కారణంగా ముగిశాయి. మరో 1,292 కేసులు ఉపసంహరించుకున్నారు.

ముఖ్యంగా పరిష్కార ప్రణాళికలతో ముగిసిన కేసుల్లో దాదాపు 42 శాతం కేసులు గతంలో పారిశ్రామిక, ఆర్థిక పునర్నిర్మాణ బోర్డు పరిధిలో ఉన్నవి లేదా పూర్తిగా మూసివేసినవి. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పరిశ్రమల పునరుద్ధరణకు ఈ చట్టం ఎంతగానో దోహదపడిందనే విషయానికి ఇదొక నిదర్శనం.

అప్పులు తీసుకునే వారిలో రుణ క్రమశిక్షణను పెంచడంలో, సకాలంలో అప్పులు తిరిగి చెల్లించే విధానాన్ని బలోపేతం చేయడంలో కూడా ఈ చట్టం కీలక పాత్ర పోషించింది.

జాతీయ కంపెనీల న్యాయ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముందు దాఖలైన 30,000 కంటే ఎక్కువ కేసులు కోర్టు ద్వారా అధికారికంగా స్వీకరించక ముందే ఉపసంహరణల ద్వారా పరిష్కారమయ్యాయి. వీటి మొత్తం విలువ దాదాపు రూ. 14 లక్షల కోట్లుగా అంచనా. అధికారిక దివాలా ప్రక్రియల దాకా వెళ్లకుండానే ముందే ఆర్థిక ఒత్తిడిని సకాలంలో పరిష్కరించుకునేలా అప్పు తీసుకున్న వారికి, అప్పు ఇచ్చిన వారికి మధ్య ఉన్న సంబంధాలను ఈ చట్టం ఎంతవరకు మార్చివేసిందో ఈ పరిష్కారాలు తెలియజేస్తున్నాయి.

ఒకవేళ ఇటువంటి ముందస్తు పరిష్కారాలు, ఉపసంహరణలు జరగకపోయి ఉంటే బ్యాంకింగ్ రంగం స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి సెప్టెంబర్ 2025 నాటికి నమోదైన 2.1 శాతం స్థాయి కంటే చాలా ఎక్కువగా ఉండేది. 2017లో ఈ రేటు దాదాపు 11.8 శాతంగా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన 'రిపోర్ట్ ఆన్ ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా' పేర్కొంది. మెరుగైన బకాయిల వసూలు ఫలితాలు, వేగవంతమైన పరిష్కార కాలపరిమితులు, రుణదాతల అధిక అధికారాల ద్వారా దేశ దివాలా పరిష్కార విధానం మరింత బలోపేతమైంది. దేశీయ పరిష్కార, వసూళ్ల వ్యవస్థ సామర్థ్యంలో వచ్చిన మెరుగు దలలను గుర్తిస్తూ.. ప్రముఖ రేటింగ్ సంస్థ 'ఎస్ అండ్ పీ గ్లోబర్ రేటింగ్స్' దేశ దివాలా పరిష్కార నియమాలను 'గ్రూప్ సి' నుంచి 'గ్రూప్ బి' కి ఆధునీకరించింది.

# ఉపరితల బొగ్గు.. లిగ్నైట్‌ను వాయువుగా మార్చే ప్రాజెక్టులకు ప్రోత్సాహక పథకంపై బొగ్గు శాఖ రోడ్‌షో

న్యూఢిల్లీ, మే 29: దేశంలో ఉపరితల బొగ్గు, లిగ్నైట్‌లను వాయువుగా మార్చే ప్రాజెక్టులకు ప్రోత్సాహక పథకంపై బొగ్గు మంత్రిత్వ శాఖ ఇవాళ న్యూఢిల్లీలో రోడ్‌షో నిర్వహించింది. పలువురు విధాన రూపకర్తలు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సాంకేతిక సేవా ప్రదాతలు, పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు సహా బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోని కీలక భాగస్వాములు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా, సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే గౌరవ అతిథిగా హాజరయ్యారు. వారితోపాటు బొగ్గు శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్, అదనపు కార్యదర్శి శ్రీ సనోజ్ కుమార్ ఝా, ఇతర సీనియర్ అధికారులు కూడా ఇందులో పాల్గొన్నారు.

బొగ్గును వాయువుగా మార్చడం ద్వారా సాధించగల అపార ఇంధన సామర్థ్యం, కొత్త పథకం కింద విధానపరంగా లభించే మద్దతు సహా ఈ వ్యూహాత్మక రంగంలో భారీ స్థాయి భాగస్వామ్యానికిగల వినూత్న అవకాశాలను ఈ రోడ్‌షో ప్రస్ఫుటం చేసింది. దేశమంతటా విస్తృతంగా లభ్యమయ్యే బొగ్గు వనరులను మరింత పరిశుభ్రంగా, సమర్థంగా వాడుకునే దిశగా చర్చలు, సహకారం, భాగస్వామ్యాలపై అవగాహనకు ఈ కార్యక్రమం ఓ కీలక వేదికగా కూడా ఉపయోగపడింది.

ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి ప్రధానో పన్యాస మిస్తూ- ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వాన మన దేశం భవిష్యత్ సంసిద్ధంగా రూపొందుతున్నదని చెప్పారు. ఈ క్రమంలో స్వయం సమృద్ధి, సురక్షిత ఇంధన వ్యవస్థగా మారడంలో స్థిరంగా పురోగమిస్తోందని తెలిపారు. దేశ పారిశ్రామిక, ఆర్థిక వికాసం దిశగా బొగ్గు గ్యాసిఫికేషన్ కీలక పునాది కాగలదని వివరించారు. ఇది కేవలం ఇంధన కార్యక్రమం స్థాయికి పరిమితం కాదని, ఒక వ్యూహాత్మక జాతీయ లక్ష్యంతో దిగుమతి పరాధీనత తగ్గించడానికి బాటలు వేస్తుందన్నారు. దీంతోపాటు స్వచ్ఛమైన బొగ్గు వినియోగానికి ప్రోత్సాహం సహా ఎరువులు, పెట్రోరసాయనాలు, మిథనాల్, హైడ్రోజన్, అధునాతన తయారీ వంటి అనుబంధ పరిశ్రమలలో కొత్త అవకాశాల సృష్టికి దోహదం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

బొగ్గును గ్యాస్‌గా మార్చే ప్రాజెక్టులను ప్రోత్సహించడంపై ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తున్నదని మంత్రి చెప్పారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా ఈ ప్రాజెక్టులను వేగిరపరచేందుకు ఇప్పటికే రూ.8,500 కోట్లతో ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించిందని, దీనికితోడు ఇటీవలే అదనంగా రూ.37,500 కోట్ల ఆర్థిక సహాయ ప్యాకేజీని కూడా ఆమోదించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమాల ద్వారా దాదాపు రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం సహా భారీ సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు ఎరువులు, మిథనాల్, హైడ్రోజన్, పెట్రోరసాయనాలు వంటి రంగాల్లో పటిష్ఠ పారిశ్రామిక విలువ వ్యవస్థ రూపొందుతుందని ఆయన అన్నారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నానాటికీ మారే ధోరణులు, భౌగోళిక రాజకీయ పరిణామాలు, పశ్చిమాసియాలో అస్థిరత, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ గతిశీలత తదితరాల నడుమ వివేచనతో వ్యవహరించాల్సి ఉందన్నారు. తదనుగుణంగా జాతీయ దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి, వ్యూహాత్మక పారిశ్రామిక భద్రతల దిశగా పునరుత్థాన దేశీయ పారిశ్రామిక సామర్థ్యాల బలోపేతం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. పారిశ్రామిక డిమాండ్ పెరుగుదల నేపథ్యంలో బలమైన విధాన మద్దతు, అత్యాధునిక సాంకేతిక సామర్థ్యాలు, కాలుష్య రహిత బొగ్గు సాంకేతికతలు, సుస్థిర పారిశ్రామిక ప్రగతిలో భారత్ ప్రపంచ అగ్రగామిగా ఎదగడానికి దేశంలోని విస్తృత బొగ్గు నిల్వలు పటిష్ఠ పునాది ఏర్పరుస్తున్నాయని మంత్రి వివరించారు.

మిథనాల్, అమ్మోనియా, ఎరువులు, ఇతర కీలక రసాయనాల కోసం దేశం దిగుమతులపై ఆధారపడాల్సిన దుస్థితిని బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రక్రియ గణనీయంగా తగ్గించగలదని శ్రీ కిషన్ రెడ్డి చెప్పారు. తద్వారా ప్రపంచ వాణిజ్య ఒడుదొడుకులు, ధరల అనిశ్చిత వంటి పరిస్థితుల నుంచి రైతులు, పరిశ్రమలు సహా వినియోగదారులకు రక్షణ లభిస్తుందని స్పష్టం చేశారు. బొగ్గును వాయువుగా మార్చే ప్రక్రియలో ఒక ప్రధాన ప్రపంచ కూడలిగా ఎదగడానికి అవసరమైన వ్యవస్థలు, సంస్థాగత-సాంకేతిక సామర్థ్యం భారత్‌కు మెండుగా ఉన్నాయని స్పష్టం చేశారు. బొగ్గును వాయువుగా మార్చే ప్రక్రియ విలువ వ్యవస్థ అంతటా ఈ కార్యక్రమం అమలును వేగిరపరచడంలో వివిధ మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, అగ్ర పారిశ్రామిక సంస్థలు, పరిశోధకులు, అంకుర సంస్థలు, సాంకేతిక భాగస్వాములను ఒకే వేదికపైకి తెచ్చే బలమైన "ఏకోన్ముఖ విధానం" అనుసరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. సమన్వయ కృషి, పరిశ్రమల భాగస్వామ్యంతో బొగ్గును వాయువుగా మార్చే ప్రక్రియ ద్వారా దేశ దీర్ఘకాలిక ఇంధన భద్రత, పారిశ్రామిక స్వావలంబన సాకారం కాగలవన్నారు. అంతేగాక 2047 నాటికి దేశం 'వికసిత భారత్'గా రూపొందాలన్న సంకల్ప సాకారంలో ఇదొక మూలస్తంభం కాగలదని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. బొగ్గును వాయువుగా మార్చే ప్రక్రియను ప్రోత్సహించడంతోపాటు దేశీయ అపార బొగ్గు వనరుల మరింత పరిశుభ్ర రీతిలో వాడుకునే దిశగా ప్రభుత్వం ఆమోదించిన రూ.37,500 కోట్ల విలువైన పథకం ఒక నిర్ణయాత్మక ముందడుగని ఆయన స్పష్టం చేశారు. ఎల్ఎంజీ, మిథనాల్, అమ్మోనియా, యూరియా, అమ్మోనియం నైట్రేట్, కోకింగ్ కోల్ వంటి ఉత్పత్తుల దిగుమతి పరాధానతను ఈ ప్రక్రియ గణనీయంగా తగ్గిస్తుందని చెప్పారు. అంతేకాకుండా దేశ ఇంధన భద్రతను, పారిశ్రామిక స్వావలంబనను మరింత పటిష్ఠం చేస్తుందన్నారు.

పెట్టుబడుల వేగం పెంచడంలోనూ ఈ కార్యక్రమం సానుకూల ప్రభావం చూపుతుందని, తద్వారా భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు అందివస్తాయని తెలిపారు. ముఖ్యంగా దేశంలో బొగ్గు నిక్షేపాలుగల, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేస్తుందని శ్రీ దూబే స్పష్టం చేశారు. ఈ దిశగా భాగస్వామ్య సంస్థల ఉత్సాహపూరిత భాగస్వామ్యాన్ని అభినందించారేఉ. బొగ్గు వనరులను మరింత సుస్థిర, విలువ జోడింపు రీతిలో వినియోగించుకోవడానికి భరోసా ఇవ్వడంతోపాటు బొగ్గును వాయువుగా మార్చే ప్రక్రియతో సరికొత్త వృద్ధికి బాటలు పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ రోడ్‌షో ప్రారంభం సందర్భంగా బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్ స్వాగతోపన్యాసం చేశారు. పారిశ్రామిక పరిణామశీలత, వ్యూహాత్మక స్వావలంబన, జాతీయ పునరుత్థాన సామర్థ్యాల రీత్యా తదుపరి అధ్యాయం దిశగా భారత్ తన సొంత వనరులు, నైపుణ్యం సద్వినియోగానికి కృషి చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి కీలక మలుపులో ఈ కృషి ఇంధన భద్రతకు పరిమితం కాదని, వ్యూహాత్మక దిగుమతులపై పరాధీనతను తగ్గించడానికీ ఎంతో ముఖ్యమని తెలిపారు. మరోవైపు పారిశ్రామిక సరఫరా వ్యవస్థల బలోపేతం, దేశీయ ఉత్పాదక సామర్థ్య సృష్టి, సమృద్ధ సహజ వనరుల సద్వినియోగంతో అధిక విలువను రాబట్టడం వంటి వాటికీ ఇదెంతో అవశ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ జాతీయ కృషిలో పారిశ్రామిక రంగానికి సమాన భాగస్వామ్యంతో ఆహ్వానం పలుకుతూ, రోడ్‌షోలో ఉత్సాహంగా పాల్గొన్నందుకు సంబంధిత వర్గాలన్నింటికీ ధన్యవాదాలు తెలిపారు.

దేశంలోని విస్తృత బొగ్గు, లిగ్నైట్ నిల్వలను జాతీయ సంపదగా అభివర్ణిస్తూ- దీన్ని సద్వినియోగం చేసుకుంటారా లేదా అన్నది కాకుండా ఎంత వివేచనాత్మకంగా వాడుకుంటారన్నదే ముఖ్యమని శ్రీ దత్ వివరించారు. బొగ్గును వాయువుగా మార్చే ప్రక్రియే ఇందుకు సముచిత పరిష్కారమని చెప్పారు. ఈ సాంకేతికత ద్వారా బొగ్గును సింథటిక్ సహజ వాయువు, యూరియా, మిథనాల్, అమ్మోనియా, హైడ్రోజన్ సహా ఉక్కు ఉత్పత్తి కోసం డీఆర్ఐ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చే వీలుంటుందన్నారు. తద్వారా కీలక రంగాలలో దిగుమతులపై పరాధీనత తగ్గిపోతుందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రివుండలి రూ.37,500 కోట్ల వ్యయంతో ఆమోదించిన ఆర్థిక సహాయ ప్యాకేజీ పథకం ద్వారా బొగ్గు నిల్వలున్న ప్రాంతాలలో దాదాపు 25 కొత్త వాయువుగా మార్చే ప్రాజెక్టులు ఏర్పాటుకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. దీంతో రూ.2.5 నుంచి 3 లక్షల కోట్ల దాకా పెట్టుబడులను సమీకరించవచ్చునని, సుమారు 50,000 ప్రత్యక్ష-పరోక్ష ఉద్యోగావకాశాలు అందివస్తాయని అంచనా వేశారు. సాంకేతికత సహా ఇతరత్రా చట్రాలు సహా లక్ష్యనిర్దేశిత అమలు-పర్యవేక్షణ యంత్రాంగాల ద్వారా జవాబుదారీతనానికి భరోసా లభిస్తుందని, ప్రాజెక్టులు నెలకొల్పే వారికి సౌలభ్యం కల్పిస్తుందని ఆయన విశదీకరించారు.

ప్రపంచ ఇంధన, వస్తు సరఫరా వ్యవస్థలలో భౌగోళిక రాజకీయ మార్పుల ప్రభావాన్ని శ్రీ దత్ ప్రస్తావించారు. పశ్చిమాసియాలో సంఘర్షణ నేపథ్యంలో ఇంధనం, ఎరువులు, రసాయనాలు, ఉక్కు రంగాలలో వ్యూహాత్మక స్వావలంబన ఆవశ్యకత మరింత ప్రస్ఫుటం అవుతున్నదని వివరించారు. దేశంలో బొగ్గు నిల్వలు మనకు కేవలం సరకుకు పరిమితం కాదని స్పష్టం చేస్తూ- దేశ దీర్ఘకాలిక ఆర్థిక, పారిశ్రామిక పునరుత్థాన సామర్థ్యాన్ని బలోపేతం చేయగల ఒక వ్యూహాత్మక సంపదగా వీటిని పరిగణించాలని గుర్తుచేశారు. సకాలంలో పథకాల అమలు, పటిష్ఠమైన నిర్వహణ, పారిశ్రామిక భాగస్వామ్యంపై ప్రభుత్వ నిబద్ధతను స్పష్టం చేస్తూ, ఈ పరిణమశీల కార్యక్రమంలో చురుగ్గా పాలుపంచుకోవాలని ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు, సాంకేతిక సేవా ప్రదాతలు, ఆర్థిక సంస్థలకు ఆయన ఆహ్వానం పలికారు. "ఇదొక అపూర్వ అవకాశం... అవసరం.. అత్యావశ్యకం.. ఇందుకు ఉదార మద్దతుంది.. ఇదే సరైన సమయం" అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.

ఈ రోడ్‌షోలో భాగంగా ఆసక్తికర చర్చలు-ప్రశ్నోత్తరాల కార్యక్రమం కూడా నిర్వహించారు. ఉపరితల బొగ్గు, లిగ్నైట్‌లను వాయువుగా మార్చే ప్రాజెక్టుల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలు, విధాన ప్రోత్సాహకాలు, సాంకేతిక సంసిద్ధత, అమలు నమూనాలు, విస్తృత సహాయక చట్రం సంబంధిత అంశాలపై సంభావ్య పెట్టుబడిదారులు-భాగస్వాములు ఈ సందర్భంగా చర్చించుకున్నారు.

బొగ్గును వాయువుగా మార్చే ప్రాజెక్టులపై పారిశ్రామికవేత్తలలో పెరుగుతున్న విశ్వాసాన్ని, భాగస్వాములను చురుకుగా మమేకం చేయడంతోపాటు వారికి సౌకర్యాలు కల్పించడంపై మంత్రిత్వ శాఖ నిబద్ధతను ఈ పరస్పర చర్చలు ప్రతిబింబించాయి.

# మక్కల కొనుగోళ్లు, తరలింపులో జాప్యం ఉండొద్దు : కలెక్టర్ అంకిత్

## -జూలూరుపాడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం పరిశీలన



ఖమ్మం, మే 29:మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని, కొనుగోలు చేసిన దిగుబడిని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని, లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జూలూరుపాడు మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి నిల్వలను తనిఖీ చేశారు. గత రాత్రి కురిసిన అకాల వర్షాల నేపథ్యంలో కేంద్రంలో ఉన్న మొక్కజొన్న నిల్వలు తడవకుండా తీసుకున్న జాగ్రత్తలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో ముందస్తుగానే టార్పాలిన్లతో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడం వల్ల ఎటువంటి నష్టం వాటిల్లలేదని వ్యవసాయ శాఖ అధికారులు తెలపడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

అనంతరం కేంద్రంలో నిల్వ ఉంచిన మొక్కజొన్న నాణ్యతను, తేమ శాతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం కేంద్రంలో 3,600 మొక్కజొన్న బస్తాలు నిల్వ ఉన్నాయని, వీటన్నింటినీ సాయంత్రంలోగా లోడింగ్ ప్రక్రియ పూర్తి చేసి తరలిస్తామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్ని లారీలలో లోడింగ్ ప్రక్రియ జరిగింది, ఇప్పటివరకు ఎంత మొత్తంలో మొక్కజొన్నను సురక్షిత ప్రాంతాలకు తరలించారు అనే విషయాలను అడిగి తెలుసు కున్నారు. ఇప్పటివరకు సుమారు 28 వేల బస్తాలను గోదాములకు తరలించినట్లు అధికారులు నివేదించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట జూలూరుపాడు తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రవి, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, మార్కెటింగ్, సివిల్ సప్లయ్ శాఖల అధికారులు ఉన్నారు.

# భారత్ - కెనడా వ్యాపార సహకారాన్నీ, పెట్టుబడి భాగస్వామ్యాలనూ బలోపేతం చేసుకునేలా.. ప్రాంతీయ మండళ్లతో చర్చించిన శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, మే 29:కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పియూష్ గోయల్ మూడు రోజుల కెనడా పర్యటన 2026 మే 28న ముగిసింది. ఈ చరిత్రాత్మక పర్యటన అత్యంత ఫలప్రదంగా సాగింది. టొరంటోలో విద్యాసంస్థలు, ఆవిష్కర్తలు, ప్రభుత్వం, వ్యాపార సంస్థలు, సంస్థాగత పెట్టుబడిదారులు, భారతీయ ప్రవాస సంఘాలతో పలు కీలక కార్యక్రమాలతో తీరిక లేకుండా ఆయన షెడ్యూల్ కొనసాగింది. భారత్ - కెనడా ఆర్థిక భాగస్వామ్యంలో నిరంతర ఉత్తేజాన్ని బలోపేతం చేయడంతోపాటు.. పెట్టుబడులు, సాంకేతిక సహకారం, దీర్ఘకాలిక భాగస్వామ్యాలకు భారత్ ప్రధాన అంతర్జాతీయ గమ్యస్థానంగా ఎదుగుతున్న తీరును ఈ సమావేశాలు స్పష్టం చేశాయి.

అంతర్జాతీయ సంబంధాలు, ప్రభుత్వ విధానాల అధ్యయనంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటిగా నిలిచిన, టొరంటో విశ్వవిద్యాలయానికి చెందిన ప్రతిష్ఠాత్మక మంక్ అంతర్జాతీయ వ్యవహారాలు - ప్రభుత్వ విధాన సంస్థ (గ్లోబల్ అఫైర్స్ - పబ్లిక్ పాలసీ స్కూల్)లో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థుల నుద్దేశించి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పియూష్ గోయల్ ప్రసంగంతో ఈ పర్యటనలో తొలి రోజు ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీ గోయల్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ సాధిస్తున్న వేగవంతమైన ఆర్థిక పురోగతిని, విప్లవాత్మక సంస్కరణలను, పెరుగుతున్న అంతర్జాతీయ ఖ్యాతిని వివరించారు. భారత్ - కెనడా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు, ప్రజా సంబంధాలను మరింత బలోపేతం చేసేలా విద్యా టసంస్థలు, పరిశ్రమలు, విధాన నిర్ణేతల మధ్య బలమైన సమన్వయానికి విస్తృతమైన అవకాశాలున్నాయని ఆయన వివరించారు.

అనంతరం శ్రీ పియూష్ గోయల్ ఆంటారియో ఆవిష్కరణల కేంద్రాన్ని (ఆంటారియో సెంటర్ ఆఫ్ ఇన్నోవేషన్ - ఓసీఐ) సందర్శించారు. అక్కడ ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, అంకుర సంస్థలకు దన్నుగా నిలిచేందుకు, పరిశ్రమలు - విద్యాసంస్థలు - ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడానికి చేపడుతున్న విస్తృతమైన కార్యక్రమాల గురించి ఆయనకు వివరించారు. అనంతరం కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్ వంటి సరికొత్త సాంకేతిక రంగాలపై కెనడా-ఇండియా టెక్ కనెక్ట్ ప్రతినిధులతో ఫలప్రదంగా చర్చించారు. ఈ సమావేశాన్నుద్దేశించి మాట్లాడుతూ.. దేశంలో వేగంగా విస్తరిస్తున్న అంకుర సంస్థలు, ఆవిష్కరణ వ్యవస్థలను వివరించడంతోపాటు, వృద్ధికి అపార అవకాశాలున్న ఈ రంగాల్లో అర్థవంతమైన భాగస్వామ్యాన్ని కెనడా ఏ విధంగా ఏర్పరచుకోవచ్చో శ్రీ గోయల్ వివరించారు. ఇరు దేశాలకు పరస్పర పూరక నైపుణ్యాలున్న ఏఐ, క్లీన్‌టెక్, అగ్రిటెక్, డీప్ టెక్ వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని కూడా ఆయన స్పష్టం చేశారు.

ఆ తర్వాత భారత్ - కెనడా కారిడార్‌లో పనిచేస్తున్న ప్రాంతీయ మండళ్ల ప్రతినిధులతో శ్రీ పియూష్ గోయల్ విస్తృతంగా చర్చించారు. వ్యాపారపరంగా సహకారాన్ని బలోపేతం చేసుకోవడంతోపాటు పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే మార్గాలపై ఈ సందర్భంగా వారి నుంచి నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలను స్వీకరించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ప్రజా సంబంధాలను మెరుగుపరచడంలో ఈ మండళ్ల పాత్రను ఆయన అభినందించారు. ద్వైపాక్షిక సంబంధాల్లో వచ్చిన నవోత్తేజం, ప్రస్తుత సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పంద చర్చల ద్వారా లభించే విస్తృతమైన అవకాశాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు.

కీలక ఉన్నత స్థాయి సమావేశంలో భాగంగా గౌరవ ఆంటారియో ప్రీమియర్ డౌగ్ ఫోర్డ్‌ను.. శ్రీ పియూష్ గోయల్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత్ - ఆంటారియో మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఉన్న అవకాశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడి భాగస్వామ్యాలను పెంపొందించుకునేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసిన ఇరువురు నేతలూ.. ఇరుపక్షాలకు వ్యూహాత్మకంగా ప్రాధాన్యత కలిగిన ఉత్పాదక రంగం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, శుద్ధ ఇంధనం, ఆహార శుద్ధి, కీలక ఖనిజాల రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న వివిధ మార్గాలపై చర్చించారు.

కెనడా వాణిజ్య మండలి అధ్యక్షుడు, సీఈవో శ్రీ గోల్డీ హైదర్‌తో శ్రీ పియూష్ గోయల్ అత్యంత ఫలప్రదమైన సమావేశాన్ని నిర్వహించారు. భారత్ - కెనడా మధ్య వాణిజ్య సంబంధాన్ని బలోపేతం చేసుకోవడంతోపాటు.. సాంకేతికత, మౌలిక సదుపాయాలు, శుద్ధ ఇంధనం, కీలక ఖనిజాలు, అధునాతన ఉత్పాదక రంగాల్లో పారిశ్రామిక నేతృత్వంలో భాగస్వామ్యాలను పెంపొందించడంపై ఈ చర్చల్లో ప్రధానంగా దృష్టి సారించారు. ఇరు దేశాల మధ్య వ్యాపార సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంలో ఇండియా - కెనడా సీఈఓ ఫోరమ్ కీలక పాత్ర పోషిస్తోందని ఇరుపక్షాలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి.

ఆంటారియో టీచర్స్ పెన్షన్ ప్లాన్ అధ్యక్షులు, సీఈవో జో టేలర్‌తో శ్రీ పియూష్ గోయల్ భేటీ అయ్యారు. భారత్‌లో మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, ఆర్థిక సేవలు, ఆరోగ్య రక్షణ, సాంకేతికత, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై ఈ సందర్భంగా వారు విస్తృతంగా చర్చించారు. సుస్థిర, సమ్మిళిత వృద్ధికి దోహదపడుతూనే.. భారత్‌లో ఉన్న బలమైన అభివృద్ధి అవకాశాలనూ, ఉత్పాదక రంగంతోపాటు దేశీయ పరిశ్రమలతో భాగస్వామ్యానికి గల విస్తృత అవకాశాలనూ మంత్రి ఈ సందర్భంగా ప్రత్యేకంగా వివరించారు.

సీపీపీ ఇన్వెస్ట్‌మెంట్స్ అధ్యక్షుడు, సీఈవో జాన్ గ్రాహంతో కూడా శ్రీ పీయూష్ గోయల్ భేటీ అయ్యారు. మౌలిక సదుపాయాలు, సరుకు రవాణా, పునరుత్పాదక ఇంధనం, రవాణా, ఆర్థిక సేవలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో భారత్‌లో దీర్ఘకాలిక సంస్థాగత పెట్టుబడులను విస్తరించడంపై వారు చర్చించారు. భారత్ వృద్ధిపై సీపీపీ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎప్పటినుంచో కనబరుస్తున్న నమ్మకాన్ని శ్రీ పీయూష్ గోయల్ స్వాగతించారు. మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, ఆర్థిక సేవల రంగాల్లో ఆ సంస్థ భారీగా చేసిన పెట్టుబడులే ఇందుకు నిదర్శనమన్నారు. భారత ఆర్థిక పునాదులు, భవిష్యత్ పురోగతిపై అంతర్జాతీయంగా ఉన్న బలమైన విశ్వాసాన్ని ఇది చాటుతోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఆర్థికంగా భారత్ మరింత బలంగా తన ముద్రను వేయడం కోసం.. భారతీయ వ్యాపార ప్రతినిధి బృందంతో శ్రీ పియూష్ గోయల్ ఫలప్రదంగా చర్చించారు. సుస్థిర వృద్ధికి, ఆవిష్కరణలకు అపారమైన అవకాశాలున్న శుద్ధ ఇంధనం, ఏరోస్పేస్, ఆహార శుద్ధి, కీలక ఖనిజాలు, మౌలిక సదుపాయాలు, సాంకేతికత వంటి రంగాల్లో భాగస్వామ్యాలను, పెట్టుబడి అవకాశాలపై క్రియాశీలకంగా చర్చించాలని వ్యాపార వర్గాలను ఆయన కోరారు. ప్రపంచవ్యాప్తంగా ఎదుగుతున్న భారత ఆర్థిక పరపతితో దేశ పరిశ్రమలకు సరికొత్త మార్గాలు తెరచుకుంటున్నాయని శ్రీ గోయల్ పేర్కొన్నారు. భారత అభివృద్ధి ప్రస్థానాన్ని ప్రపంచ దేశాలకు చాటడంలో పరిశ్రమలకు పూర్తి అండగా నిలిచేందుకు భారత ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పునరుద్ఘాటించారు.

కెనడా - ఇండియా ఫౌండేషన్ సభ్యులతో ప్రత్యేకమైన సమావేశంతో శ్రీ పియూష్ గోయల్ తన మూడు రోజుల కెనడా పర్యటనను ముగించారు. బలమైన వ్యాపార సంబంధాలు, ప్రజా సంబంధాల ద్వారా రెండు దేశాలను మరింత దగ్గర చేయడంలో ఇండో-కెనడా సమాజం అమూల్యమైన సహకారాన్ని అందించిందని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా వందకు పైగా భారతీయ పరిశ్రమల అధినేతలతో కూడిన బృందానికి నేతృత్వం వహిస్తూ శ్రీ పియూష్ గోయల్ కెనడాలో పర్యటించారు. భారత్-కెనడా ఆర్థిక సంబంధాల సమగ్ర పునరుద్ధరణ దిశగా ఇదొక చరిత్రాత్మక ముందడుగు. మే 25న ఒట్టావా, మే 26 నుంచి 28 వరకు టొరంటో నగరాల్లో సాగిన ఈ మూడు రోజుల పర్యటన సాగింది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య, ఆర్థిక బంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడమే దీని లక్ష్యం. ముఖ్యంగా, ప్రస్తుతం కొనసాగుతున్న భారత్-కెనడా సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) చర్చలను వేగవంతం చేయడంపై ఈ పర్యటనలో ప్రత్యేకంగా దృష్టి సారించారు.

ప్రస్తుతం ద్వైపాక్షిక వాణిజ్యం దాదాపు 8.5 బిలియన్ డాలర్లుగా ఉండగా.. 2030 నాటికి దానిని 50 బిలియన్ డాలర్లకు విస్తరించాలన్న ఉమ్మడి, ప్రతిష్ఠాత్మక లక్ష్యానికి ఇరుదేశాల ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయి.

# సమన్వయంతో రైల్వే అభివృద్ధి పనులు చేపట్టాలి

## -ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

హైదరాబాద్, మే 29: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు పూర్తిచేయాలని మల్కాజిగిరి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి పనుల సందర్భంగా ఇతర శాఖలతో సమన్వయంతో పనులు పూర్తిచేయాలని తెలిపారు. మల్కాజిగిరి అభివృద్ధి పనులపై రైల్వే ఉన్నతాధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మార్చే పనుల పురోగతిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

విద్యుత్‌శాఖల మధ్య సమన్వయంతో పనులు పూర్తిచేయాలన్నారు. విద్యుత్ వైర్లను అండర్‌గ్రౌండ్‌లోకి రైల్వే ఇంజినీర్ రాజేంద్రప్రసాద్, రవిప్రకాశ్, రైల్వే యూనియన్ సభ్యులు నూర్, విద్యుత్ అధికారులు వెంకన్న, డీఈ అన్వర్, నేతలు ఏకే.మురుగేష్, సిద్ధిరాములు, నర్సింగ్‌రావు, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

# 'అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి'

## -రాష్ట్ర వ్యవసాయం, గ్రామీణ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్

ఖమ్మం, మే 29: రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ తక్షణమే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలూరుపాడు మండలం రామచంద్రాపురం గ్రామంలో తెలంగాణ వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం 7వ మండల మహాసభ పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, పద్దం సుగుణ సంయుక్త అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభల ప్రారంభ సూచికగా సంఘం జెండాను సీనియర్ నాయకులు కొడెం బక్కులు ఆవిష్కరించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ.. దోపిడీకి వ్యతిరేకంగా, పేదల హక్కుల కోసం నడిచిన పోరాటాల చరిత్రను స్మరించుకున్నారు.

1936వ సంవత్సరంలో అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించారని, ఆ స్ఫూర్తితో పోరాటాల పురిటిగడ్డ అయిన జూలూరుపాడులో అమరజీవి కాసాని అయిలయ్య సంఘాన్ని బలోపేతం చేశారని కొనియాడారు. ఆనాడే కూలి సంఘం ఆధ్వర్యంలో జీతగాళ్ల సంఘాన్ని ఏర్పాటు చేసి దోపిడీపై రాజీలేని పోరాటం చేశారన్నారు. సాగు భూములు పేదలందరికీ దక్కాలనే లక్ష్యంతో నిరంతరం భూ పోరాటాలు నడిపిన ఘనత తెలంగాణ వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘానిదేనని స్పష్టం చేశారు. మండల పరిధిలో గతంలో జరిగిన చొప్పకట్టల పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందన్నారు.

మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

మహాసభల ముగింపు సందర్భంగా జూలూరుపాడు మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా యాసా నరేష్, కార్యదర్శిగా రాచబంటి కోటేశ్వరరావు, మండల మహిళా కన్వీనర్‌గా పద్దం సుగుణ ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ అధికారికంగా ప్రకటించారు. ఈ మహాసభలో నూతన కమిటీ సభ్యులు పెరుమాళ్ళ వెంకటేశ్వర్లు, ఇల్లంగి సీతారాములు, తోలెం సరస్వతి, గుగులోత్ నర్సింహారావు, తాటి కృష్ణవేణి, బానోత్ కృష్ణ, ఊడల వెంకటేశ్వర్లు, తాటి ఇందిర, వేముల ఉపేందర్, ఎలగల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# తెలుగు సాహిత్యానికి తత్వ శిఖరం ...శేషేంద్ర శర్మ

## మే 30...గుంటూరు శేషేంద్ర శర్మ వర్ధంతి



తెలుగు సాహిత్యాన్ని తన అద్భుత కవిత్వంతో, లోతైన విమర్శలతో, విశ్లేషణాత్మక వ్యాసాలతో కొత్త దిశల్లో నడిపించిన మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ. ఆయన కేవలం ఒక కవి మాత్రమే కాకుండా, సమాజంలో చైతన్యాన్ని రేపే ఒక విప్లవాత్మక శక్తి. ఆధునిక తెలుగు కవిత్వానికి ఊతమిచ్చిన మహోన్నత వ్యక్తిత్వం. శేషేంద్ర సాహిత్య ప్రపంచం వర్ణనాత్మకత, తత్త్వచింతన, సామాజిక చింతన, భాషా వైవిధ్యం, అంతర్జాతీయ దృక్పథం లతో విస్తరించి ఉంది.

శేషేంద్ర శర్మ జననం 1927 అక్టోబర్ 20న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నాగరాజుపాడు గ్రామంలో జరిగింది. ఆయన తండ్రి సంస్కృత సాహిత్యంలో ప్రావీణ్యం కలిగిన పూజారి గుంటూరు సుబ్రహ్మణ్య శర్మ. చిన్ననాటి నుంచే శేషేంద్రకు వేదాలు, ఉపనిషత్తులు, సంస్కృతం మీద మక్కువ పెరిగింది. విద్యాభ్యాసం తొటపల్లి గూడూరు పాఠశాలలో ప్రారంభమై ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడిగా, మద్రాసు లా కాలేజీ నుండి న్యాయ శాస్త్రంలో డిగ్రీతో కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మునిసిపల్ కమిషనర్గా ఉద్యోగం చేసినప్పటికీ, సాహిత్యపట్ల ఆయన ఆసక్తి ఎప్పటికీ తగ్గలేదు.

శేషేంద్ర శర్మ సాహితీ ప్రస్థానం అసాధారణం. ఆయన కవిత్వంలో ఉన్న అద్భుత ఊహాశక్తి, సామాజిక చింతన, తత్త్వ విచారణ, వ్యక్తిత్వ విశ్లేషణ తెలుగు కవిత్వాన్ని కొత్త శిఖరాలకు చేర్చింది. కేవలం రూపకాలు, అలంకారాలతోనే కాదు, కవిత్వంలో లోతైన భావాలను మేళవించి సమాజాన్ని ఆలోచింపజేసే విధంగా రచనలు చేశారు. తన కవిత్వంలో తర్కం, ఆచారవిచారం, చరిత్ర బోధ, తత్త్వచింతన మేళవించి ఒక ప్రత్యేక శైలిని రూపొందించారు.

"నా దేశం ? నా ప్రజలు" అనే కావ్యం శేషేంద్రగారిని దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చింది. ఇందులో సామాజిక అసమానతలు, దేశభక్తి, మానవీయత వంటి అంశాలను రసప్రధంగా, ఆవేశ పూరితంగా వ్యక్తీకరించారు. "మంథర", "షోడశి ? రామాయణ రహస్యాలు", "ఆధునిక మహాభారతం", "స్వర్ణహంస", "సముద్రపు రెక్కలు", "నెమలికన్ను" వంటి రచనలు శేషేంద్రను ఆధునిక తెలుగు సాహిత్యంలో దృఢంగా నిలిపాయి. "మంథర"లో భారతీయ తత్త్వశాస్త్రం పట్ల ఆయన అవగాహన, అంతరంగా పొందిన అనుభూతులు ప్రతిఫలిస్తాయి. "షోడశి"లో రామాయణంలోని రహస్యాలను లోతుగా పరిశీలిస్తూ శ్రీవరాలను సరికొత్త దృక్పథంలో ఆవిష్కరించారు.

శేషేంద్ర వచన కవిత్వం కేవలం వర్ణనాత్మకతకు పరిమితం కాకుండా, జాతీయ మరియు అంతర్జాతీయ సాహిత్య ధోరణులను అద్భుతంగా మిళితం చేసింది. అందులో భాషా వైవిధ్యం, సంస్కృత పదసముపేతం, ప్రతీకలు, చిహ్నాల విశేష ప్రయోగం, శబ్ద సౌందర్యం సమ్మేళనం సాహితీ పాఠకులను విశేషంగా ఆకర్షిస్తుంది. కవిత్వం అంటే కేవలం భావాలను వ్యక్తీకరించడం మాత్రమే కాదు, అది ఒక చైతన్య ప్రవాహం అని ఆయన నిరూపించారు.

శేషేంద్ర కవిత్వం మనసుకు హత్తుకునే రూపంలో, ఒక వేళ వినిపిస్తే సంగీతంలా, చదివితే తత్త్వ రససుధగా అనిపిస్తుంది. "సముద్రం నా పేరు", "గొరిల్లా", "మండే సూర్యుడు", "కవిసేన మేనిఫెస్టో", "రక్తరేఖ", "కాలరేఖ", "జనవంశమ్" వంటి రచనలు కాలంతో పోరాడే కవిత్వానికి, సమాజాన్ని చైతన్యపరిచే సాహిత్యానికి ప్రతీకలు.

శేషేంద్రకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (1994లో "నా దేశం ? నా ప్రజలు"కు), తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, కలకత్తా రాష్ట్రీయ హిందీ అకాడమీ అవార్డు, విశ్వకవి పురస్కారం లాంటి అనేక ప్రతిష్ఠాత్మక బహుమతులు లభించాయి. కవిసేనాని, కవి చక్రవర్తి, రాష్ట్రేంద్రులాంటి బిరుదులు ఆయన సాహిత్య ప్రస్థానానికి గౌరవ తీర్థాలు.

శేషేంద్ర శర్మ కేవలం కవి కాదు ? తత్త్వవేత్త, చింతకుడు, సమాజానికి మార్గదర్శకుడు. ఆయన రచనలు తెలుగులోనే కాదు, అనేక భాషల్లోకి అనువదించబడి విశ్వ సాహిత్యంలోనూ తనదైన స్థానం సంపాదించు కున్నాయి. 2007 మే 30న ఆయన భౌతికంగా మన మధ్యనుండి వెళ్లిపోయినా, ఆయన సాహిత్యమూర్తి తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది.

తెలుగు సాహిత్య చరిత్రలో శేషేంద్ర శర్మ ఒక మహానామం. ఆయన కవిత్వం, విమర్శ, తత్త్వచింతనలు ఈ తరానికి మాత్రమేకాదు, రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవనున్నాయి.



**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
9440595494

---

# దుభా భాస్కరరావు గారికి ఘన సన్మానం



హైదరాబాద్, మే 29:(నేటినిజం ప్రతినిధి)సంగీత సాహిత్య సుధావాహిని సంస్థ ఆధ్వర్యంలో రక్షణ శాఖకు చెందిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)లో ఎస్ఐగా పదవీ విరమణ చేసిన శ్రీ దుభా భాస్కర రావు గారికి ఘన సన్మాన సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ దాసరి శ్రీనాథ్ గౌడ్ గారు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సాహిత్య సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి శ్రీ అల్లాడి శ్రీనివాసు గారు హాజరయ్యారు. వేదికపై శ్రీ గొల్లపిల్లి బ్రహ్మయ్యాచార్య గారు, శ్రీ ఎలకపల్లి మల్లేశు గారు, శ్రీ దుర్గం రాజేశింగ గౌడ్ గారు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు డాక్టర్ దాసరి శ్రీనాథ్ గౌడ్ గారు మాట్లాడుతూ, "శ్రీ దుభా భాస్కరరావు గారు రక్షణ శాఖలో అత్యంత బాధ్యతాయుతమైన సేవలను అందించినప్పటికీ, వారి ప్రవృత్తి సాహిత్యానికి అత్యంత సమీపంగా ఉంటుందని" పేర్కొన్నారు. వారు కేవలం ఉద్యోగ పరంగా మాత్రమే కాకుండా, సాహితీవేత్తగా, సాహితీ పిపాసిగా, సాహితీ పోషకుడిగా, సాహిత్యాభిమానిగా విశేష గుర్తింపు పొందారని కొనియాడారు. దేశవ్యాప్తంగా వివిధ కళా, సాహిత్య సంస్థలతో పాటు విద్యాపీఠాలతోనూ వారికి సన్నిహిత అనుబంధం ఉందని, అనేక ఆధ్యాత్మిక సంస్థలు మరియు పీఠాధిపతులతో సత్సంబంధాలు కలిగి ఉన్న ఆధ్యాత్మిక చింతనాపరులని పేర్కొన్నారు. వారి భాషా సంపద, సౌమ్య స్వభావం, సేవా దృక్పథం సమాజానికి ఆదర్శప్రాయమని అన్నారు. సభకు హాజరైన అతిథులు, సాహితీ మిత్రులు, అభిమానులు శ్రీ దుభా భాస్కరరావు గారిని ఘనంగా అభినందించి, వారి సేవలను ప్రశంసించారు. కార్యక్రమం అనంతరం సభకు విచ్చేసిన వారందరికీ భోజన వసతి కల్పించబడిందని సంగీత సాహిత్య సుధావాహిని సంస్థ తెలిపింది.

# టీటీడీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.15 లక్షలు విరాళం

తిరుపతి, మే 29:గుంటూరుకు చెందిన డాక్టర్ అన్నం శ్రీనివాస్ శుక్రవారం టీటీడీకి చెందిన వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టు కు రూ. 15,00,116 విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తరఫున టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

హైదరాబాద్కు చెందిన ఇందు డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ తలశిల వేంకటేశ్వరరావు శుక్రవారం తిరుపతిలోని టీటీడీ సెంట్రల్ ఆసుపత్రికి రూ. 7.50 లక్షల విలువైన ఔషధాలను విరాళంగా అందించారు. దాత తరఫున టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళాన్ని అందజేశారు.

# అంతర్జాతీయ వృద్ధి, డెలివరీ సామర్థ్యాల విస్తరణే లక్ష్యంగా 'ఇనెటమ్ ఇండియా' ప్రారంభం

హైదరాబాద్, మే 29:యూరోపియన్ డిజిటల్ సేవల సంస్థ 'ఇనెటమ్' అంతర్జాతీయ మార్కెట్లలో తన డెలివరీ సామర్థ్యాలను వేగవంతం చేయడానికి, వ్యాపార వృద్ధిని పెంపొందించడానికి భారతదేశానికి చెందిన ఏఐ-నేటివ్ సాంకేతిక సంస్థ 'ఐనోస్' భాగస్వామ్యంతో 'ఇనెటమ్ ఇండియా'ను ప్రారంభించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను తన కార్యాచరణ పునాదిగా చేసుకుని రూపొందించబడిన ఈ ప్రత్యేకమైన మోడల్ ద్వారా సంప్రదాయ ఆఫ్షోర్ పద్ధతులకు భిన్నంగా అంతర్జాతీయ క్లయింట్లకు అత్యంత వేగవంతమైన, కచ్చితమైన ఎండ్-టు-ఎండ్ డిజిటల్ పరిష్కారాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. డెలివరీ సామర్థ్యాలను ఫ్రాన్స్, బెల్జియం, బల్గేరియా, పోలాండ్, యూకేఐలో బలోపేతం చేయడం లక్ష్యం. ఈ సందర్భంగా ఇనెటమ్ చైర్మన్, సీఈఓ జాక్వెస్ పొమ్మెరాడ్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్తో కేవలం ఒక ఆఫ్షోర్ సామర్థ్యాన్ని మాత్రమే నిర్మించడం లేదన్నారు. ఇనెటమ్ కోసం ఒక కొత్త వృద్ధి ఉత్ప్రేరకానికి పునాది వేస్తున్నామన్నారు. ఇనెటమ్ ఇండియాను రూపొందించడానికి, వేగంగా విస్తరించడానికి ఐనోస్ను ఉపయోగించుకోవడం ద్వారా ఒక అత్యుత్తమ మోడల్ను ఎంచుకుంటున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా ఐనోస్ సహ-వ్యవస్థాపకుడు ఉ వైస్ చైర్మన్ సీపీ గుర్నాని మాట్లాడుతూ ఇనెటమ్ ఇండియాని స్థాపించడంలో ఇనెటమ్కు ప్రత్యేక భాగస్వామిగా ఉన్నందుకు గర్విస్తున్నామన్నారు. ఈ బాధ్యత ఐనోస్ ఏ ఉద్దేశ్యంతోనైతే నిర్మించబడిందో కచ్చితంగా ప్రతిబింబిస్తుందన్నారు. మేధస్సును అంతర్భాగంగా కలిగి ఉండేలా ఒక కేంద్రాన్ని రూపొందించడానికి, మా ఉద్యోగులు, మా టెక్నాలజీ స్టాక్, మా డెలివరీ ఐపీతో కూడిన మా పూర్తి ఏఐ-నేటివ్ సామర్థ్యాన్ని తీసుకు వస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ?ఇనెటమ్ సొల్యూషన్స్ సీఈఓ హేమంత్ లాంబా





మాట్లాడుతూ ఇది మా ఇనెటమ్ సొల్యూషన్స్ సామర్థ్యాలను విస్తృతంగా బలోపేతం చేస్తుందన్నారు. మా ఫ్రేమ్వర్క్ చొరవను మరింత బలపరుస్తుందన్నారు. ఉత్తమమైన ఏఐ, సాంకేతిక నైపుణ్యం, స్థానికత, క్లయింట్లకు సామీప్యతను కలిపి ఉంచే ఈ ప్రత్యేకమైన మోడల్తో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మా క్లయింట్లకు అత్యంత విలువైన, ఎండ్-టు-ఎండ్ పరిష్కారాలను అందించే మా సామర్థ్యాన్ని వేగవంతం చేస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా ఐనోస్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అర్జున్ నాగలుపల్లి మాట్లాడుతూ ముఖ్యంగా సంక్లిష్టమైన ఎంటర్ప్రైజ్ పర్యావరణ వ్యవస్థలో, విజయవంతమైన ఏఐ అమలుకు ప్రక్రియలు, వ్యక్తులు, సాంకేతికత సరైన రీతిలో సమలేఖనం కావడం అవసరమని నమ్ముతున్నామన్నారు. ఐనోస్ లోతైన, ప్రాక్టీషనర్-స్థాయి ఏఐ ప్లాట్ఫారమ్లను ఉ పరిశ్రమ-నిర్దిష్ట పరిష్కారాలను కలిగి ఉందన్నారు. వేము నిర్ణయాలను సులభతరం చేసే, కాలక్రమేణా విలువను పెంచే ఏజెంటిక్ వర్క్ఫ్లోల ద్వారా అమలును ముందుకు నడిపిస్తామన్నారు. సంప్రదాయ ఇంప్లిమెంటేషన్ పార్టనర్లు ఇప్పుడిప్పుడే అర్థం చేసుకోవడం ప్రారంభిస్తున్న విషయం ఇదన్నారు. ఇనెటమ్ వంటి భారీ స్థాయి ప్రతిష్ఠాత్మకమైన సంస్థకు, ఈ వ్యత్యాసమే అత్యంత కీలకమన్నారు.

# కరెంటు షాక్ వలన ఇల్లు, ఇంట్లోని వస్తువులు దగ్ధం..

నల్గొండ, మే 29: కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలోని శ్రీనివాస్ నగర్ గ్రామంలో పొన్నాల రాజవ్వ-చంద్రయ్య కు చెందిన నివాసంలో కరెంటు షాక్ వలన ఇంటిలో ఉన్న టీవీ, బియ్యం, బట్టలతోపాటు నిత్యావసర వస్తువులు కాలిపోయాయి. చంద్రయ్య చాకలి వృత్తి తో పాటు కూలీ పని చేసుకుని జీవనం గడుపుతున్నారు. 100 రోజుల కూలీ పని కోసం కొడుకు, కోడలు ఇద్దరూ వెళ్ళగా చంద్రయ్య,రాజవ్వ దంపతులు వృత్తి పనికి వెళ్లారు.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో నుండి మంటలు రావడం గమనించిన చుట్టుప్రక్కల వారు వెంటనే కూలీ పనులకు వెళ్లిన కొడుకుకు కాల్ చేసి చెప్పడంతో వెంటనే ఇంటికి వచ్చి చుట్టూ పక్కల వారి సహాయంతో మంటలను ఆర్పివేశారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న టీవి, బియ్యం సంచులు, బట్టలతో పాటు, నిత్యావసర వస్తువులు కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బందితో పాటు, స్థానిక పోలీసులు,రెవెన్యూ అధికారులు వచ్చి పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబీకులు కోరారు.

# పెనగడపలో వడదెబ్బతో వడ్రంగి మృతి

ఖమ్మం, మే 29: తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బ తగిలి ఓ వడ్రంగి మృతి చెందిన ఘటన చుంచుపల్లి మండల పరిధిలోని పెనగడప గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలకు ప్రకారం.. గ్రామానికి చెందిన కళ్లకూరి వెంకట్రావు (62) వడ్రంగి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. గురువారం మధ్యాహ్నం ఎండ తీవ్రతకు అస్వస్థతకు గుంయ్యాడు. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

# మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్, మే 29:రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత , గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా మహిళా వారోత్స వాలల్లో భాగంగా శుక్రవారం ఇంద్రవెల్లి మండల కేంద్రం ఐకేపీ కార్యా లయ ప్రాంగణంలో మహిళా సంఘాలు, గుడిహత్నూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో నూతనం గా ఏర్పాటు చేసిన సోయా ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సోయాబీన్ పంట సాగు విస్తృతంగా ఉన్నప్ప టికీ, స్థానిక ప్రాసెసింగ్ యూనిట్లు తక్కువగా ఉండటం వల్ల రైతులు, మహిళలు ఆశించిన స్థాయిలో లబ్ధి పొందలేకపోతున్నారని గుర్తించి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతర్జా తీయ సంస్థ ఇక్రిశాట్ సాంకేతిక భాగస్వామ్యంతో రూ. 30 లక్షల వ్యయంతో ఈ సోయా ప్రాసెసింగ్ యూనిట్ను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. ప్రారంభ బాల్య అభివృద్ధి పై అవగాహన కల్పిస్తూ గర్భధారణ సమయం నుంచి శిశువుకు రెండు సంవత్స రాలు నిండే వరకు ఉండే 1000 రోజులు జీవితానికి బలమైన పునాది వంటివని తెలిపారు.



ఈ కాలంలో పిల్లల ఎదుగుదల కోసం పోషకాహారం, ఆరోగ్యం, ప్రారంభ విద్య, స్పందనాత్మక సంరక్షణ, భద్రత, తల్లిదండ్రుల శ్రేయస్సు అనే 6 సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమం లో డీఆర్డీవో రవీం దర్ రాథోడ్, డీడబ్ల్యూవో మిల్కా, జడ్పీ సీఈవో రవి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, సర్పంచ్ రాథోడ్ మోహన్ సింగ్, ఎంపీడీవో జీవన్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం మంజుల, మహిళా సంఘాల ప్రతినిధులు, ఐకేపీ సీసీలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ అవగాహన సదస్సు

## - ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి

రాజన్న సిరిసిల్ల, మే 29: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ అర్బన్ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ (ఎస్ ఐ ఆర్) పై అవగాహన సదస్సు నిర్వహించి అనంతరం ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా దేశంలో ఉన్న బోగస్ ఓట్లను తొలగించడమే కాకుండా దేశ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయబడుతున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, వక్తగా హాజరైన అల్లాడి రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తోందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా ఒక ఓటరుకు పలుచోట్ల ఉన్న ఓట్లను తొలగించడం, ఓటుకు భద్రత కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు.

ప్రతాప్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి బీజేపీ కార్యకర్త, బూత్ అధ్యక్షులు తమ తమ వార్డుల్లో డబుల్ ఓట్లు, బోగస్ ఓట్లను గుర్తించేలా సహకరించాలని పిలుపునిచ్చారు.

అనంతరం రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ బీజేపీ నాయకులు ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించారు.

ఈ సందర్భంగా అర్బన్ అధ్యక్షుడు బుర్ర శేఖర్ మాట్లాడుతూ 15 రోజుల క్రితం ఎమ్మార్వోకు వినతిపత్రం ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకో కపోవడం బాధాకరమన్నారు.

రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలపై ధర్నాలు చేయడం కాకుండా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుండి పోరాడాలని హితవు పలికారు.

రైతులకు త్వరితగతిన న్యాయం చేయకపోతే ప్రజలు రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, రాష్ట్ర నాయకులు ఎర్ర మహేష్, లింగంపల్లి శంకర్, మల్లేశం, కౌన్సిలర్లు కొండ్లెపు చిన్న ముత్యం, మంగళ శ్రీనివాస్, నాయకులు పిన్నింటి హనుమాన్లు, ఏరెడ్డి రాజిరెడ్డి, రేగుల శ్రీకాంత్, మామిళ్ల లక్ష్మీరాజ్యం, వివేక్ రెడ్డి, గుండెకర్ల లక్ష్మణ్, కట్కం శ్రీనివాస్, అన్నం నరసయ్య, సంజీవ్ రెడ్డి, బిల్లా కృష్ణారి, నామాల శేఖర్, బాలు, రాంబాబు, వాసం మల్లేశం, ప్రశాంత్, రాము, సగ్గు రాహుల్, యశ్వంత్, రంజిత్ రెడ్డి తదితర పట్టణ, అర్బన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తాగు నీటి సమస్యలపై జలమండలిని ముట్టడిస్తాం : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, మే 29:ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వంలో ఏ ఒక్క రోజు కూడా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతిరోజు నీటికోసం ప్రజలు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.

నల్లాలకు నీరు రావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తే నీటి కొరత ఉందని అధికారులు సమాధానం చెబుతున్నారని ధ్వజమెత్తారు. నల్లాలకు లేని నీరు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు.

ఒక్కో నీటి ట్యాంకర్ ను 4 వేల నుండి 5 వేల రూపాయల వరకు అమ్ముతూ ప్రజలను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. జూన్ 5 వ తేదీలోగా గ్రేటర్ హైద్రాబాద్ పరిధిలో త్రాగునీటి సమస్యను పరిష్కరించకుంటే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) పై దేశ వ్యాప్తంగా పలు విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# ఆరంభం మందగించినా,అంచనాలకు కట్టుబడి ఉన్న లాంక్సెస్

**LANXESS**
Energizing Chemistry

హైదరాబాద్, మే 29: నిరంతరాయంగా బలహీనంగా ఉన్న ఆర్థిక వాతావరణం, కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, గత సంవత్సరపు పోర్ట్ఫోలియో విక్రయాలు వంటి అంశాలు స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ లాంక్సెస్ 2026 ఆర్థిక సంవ త్సరం మొదటి త్రైమాసికంపై తమ ప్రభావాన్ని చూపాయి. అమ్మకాలు 1.378 బిలి యన్ యూరోలుగా నమోదయ్యాయి, ఇది గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన 1.601 బిలియన్ యూరోల అమ్మకాల కంటే 13.9 శాతం తక్కువ. మినహాయింపు లకు ముందు ఈ బి ఐ టి ఏ 94 మిలియన్ యూరోలకు చేరుకుంది, ఇది అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన 133 మిలియన్ యూరోలతో పోలిస్తే 29.3 శాతం తగ్గుదల. మొదటి త్రైమాసికంలో మినహాయింపులకు ముందు ఈ బి ఐ టి ఏ మార్జిన్, గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఉన్న 8.3 శాతంతో పోలిస్తే 6.8 శాతంగా నమోదైంది. "సంవత్సరం ప్రారంభం బలహీనంగా ఉన్నప్పటికీ, మార్చి నుండి మేం స్వల్ప సానుకూల గమనాన్ని గమనించాం. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల కారణంగా, అనేక మంది ఆసియా పోటీదారుల సరఫరా గొలుసులు దెబ్బతిన్నాయి. దీనివల్ల కస్ట మర్లు మళ్లీ లాంక్సెస్ వంటి యూరోపియన్ సరఫరాదారుల వైపు మొగ్గు చూపు తున్నారు. ప్రస్తుతం సరఫరా చేయగల సామర్థ్యం మాకు ఒక ముఖ్యమైన పోటీ ప్రయోజనంగా మారింది. అదే సమయంలో, ముడిసరుకులు, ఇంధనం, లాజిస్టిక్స్ పెరిగిన ఖర్చుల భారాన్ని అధిగమించడానికి మేం మా అనేక ఉత్పత్తుల ధరలను పెంచాము," అని లాంక్సెస్ సీఈఓ మథియాస్ జాచెర్ట్ అన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.